ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 13 | సంచిక : 08 | ఏప్రియల్ 2008

## దృశ్యం బుద్ధి యొక్క కల్పితం - దాని నివారణే సాధన

నీవు నేను మున్నగు మిధ్యా కల్పనలతో కూడిన జగత్తే "దృశ్యం" అనబడుతున్నది. ఇట్టి జగత్తు రూపము మసికానంత కాలం ముక్తి లభించదు. దృశ్యము మాయ యొక్క కార్యమని, స్వప్నము అని మేలుకొని సత్య జీవనం వైపు గురువు మేలుకొలుపుటతో బుద్ధి యొక్క కార్యము ఆగి సుఖ స్వరూపం వైపు సాధకుడు ప్రయాణం సాగిస్తాడు. వేలాది జన్మల నుంచి ద్వంద్వాల రాపిడికి నలిగి అలసి, సొలసి శాశ్వత సుఖం కోసం ఆరాట ఫలితంగానే ఈ వివేకం కలుగుతుంది. పళ్ళలోని రసం, నువ్వులలో నూని పువ్వులలో వాసనా దాగి ఉంటుంది. అలాగే ద్రష్టయందు దృశ్యం ఇమిడి ఉంటుంది. దృశ్యం ఉంటే ద్రష్ట ఉంటుంది. అందు ఏ ఒక్కటి లేకపోయినా ముక్తి లభిస్తుంది. దృశ్య బుద్ధి పరిపూర్ణంగా నశించనంతకాలం, దృశ్యం కనిపిస్తూనే ఉంటుంది. ద్రష్ట ఉంటే దృశ్యం ఉంటుంది ఇందుల్లో ఏ ఒక్కటి ఉన్నా బంధం ఉంటుంది. అందు ఏ ఒక్కటి లేకపోయినా ముక్తి లభిస్తుంది. దృశ్య బుద్ధి పరిపూర్ణంగా నశించనంతకాలం దృశ్యం కనిపిస్తూనే ఉంటుంది. దేహాభిమానం కలిగిన అజ్ఞాన స్థితి యందు ఉండే విషయవృత్తి ఉదయించి దాని వైపే అది పరుగిడుతుంది. నిత్యానిత్య వివేకం కలిగిన ప్రజ్ఞాశీలికి అల్ప విషయాలపైన విషయాదులపై దృష్టిని వారించాలనే శ్రమ ఏమీ ఉండదు. జ్ఞాని దేనికీ ప్రాముఖ్యతలు, ఆశ్చర్యాలు ఉండవు. మేరు పర్వతాన్ని గాలి కదలించజాలదు. యోగ వాసిష్ఠము "రాజ్యము కంటే, స్వర్గం కంటే, విష్ణువు కంటే, వనితా సంగమం కంటే నైరాస్యము (వైరాగ్యము) వలన పరమమగు సుఖము లభిస్తుంది" అన్నది. చిత్త వృత్తులు ఉదయించినంతనే బాహ్య విషయములయందు అనురాగము పుట్టును ఆ వస్తు భోగములతో మనస్సు అనంత దుఃఖములు

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 24
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 10/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

చిలుకూరు ...... 28-01-2008
ఈడూరు ........ 10-02-2008
భీమవరం ....... 17-02-2008

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

కలుగుతాయి. కాబట్టి గాఢ నిద్రలో వలె మనస్సును ఉంచితే పరమ పదమును పొందినట్లే దానికి గురుదేవుల కరుణతో కార్యరూపం చెందుతుంది. గాఢనిద్రలో స్వప్నము తెలియదు. స్వప్నములో సుషిప్తి తెలియదు అలాగే బ్రహ్మ స్వరూపము నందు ఉన్నవాడు సృష్టిని ఎరుగడు. సృష్టియందు లీలమైనవాడు, దృశ్యమును ఆస్వాదించువాడు బ్రహ్మమును తెలుసుకోలేడు. “చూపులోన చూపు చూడంగ చూడండ; తెలివిలోన తెలివి వెలుగుచుండు; నిద్రలోని నిద్ర నిజమని తెలియరా” అన్నారు వేమన. చూచేది ఏమిటి? చూడబడే పరికరం ఏమిటి? దేని వెలుగులో ఇది తెలియబడుతున్నది అని గ్రహించి. దృశ్యాన్ని నివారించటమే తెలివి. ఈ తెలివి గురువును ప్రేమించటం వల్లనే సాధ్యమౌతుంది.

**- సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్థవరం

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-01-2008, చిలుకూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

అందరూ సుఖంగా, శాంతిగా ఉండాలని భగవంతుడిని ప్రార్థించాలి. దానివలన మనకు ప్రేమభావం కలుగుతుంది, శాంతి కలుగుతుంది. ఇతరుల క్షేమం కోరటం వలన, ఇతరులను ప్రేమించటం వలన శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం బాగుపడతాయి. మన బీరువాకు ఉన్న అద్దమును బట్టి పెట్టి ఎలా శుభ్రపరుస్తామో అలాగ మన మనస్సును కూడా ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ ఉంటే మన హృదయంలో ఉన్న ఆత్మదేవుడు మనకు స్పష్టంగా గోచరిస్తాడు. ఏదో ఈ నాలుగు రోజులు బాగా గడిచిపోతే గడిచిపోయినాయి అనుకోవద్దు. మరణానంతర జీవితం కూడా ఉంది. ఈ శరీరంతో పాటు శరీరయాత్ర ముగిసిపోతుంది కాని జీవుడి యాత్ర ముగియదు. ఇప్పుడు జీవించి ఉండగా సుఖంగా ఉండాలంటే, మరణానంతర జీవితం సుఖంగా ఉండాలంటే కర్మానుష్టానము, భక్తి అవసరము. ఆరోగ్యం బాగా ఉన్నంతసేపు మనపని మనం చేసుకోవాలి, పని బద్ధకించకూడదు, మనకు శక్తి ఉంటే ఇతరులకు సహాయపడాలి. చేతులు పని మీద ఉండాలి, మనస్సు ఈశ్వరుని పాదాలయందు ఉండాలి. మన కుటుంబ యాత్రకు సంబంధించిన పనులు చేసుకొంటూ, మిగతా టైములో జీవకోటి క్షేమం కోసం పని చేయాలి. అలా పని చేయటం వలన మనం ఎవరికైతే సేవ చేస్తున్నామో వారికి పెద్ద లాభం కాదు కాని మనకే ఎక్కువ లాభం ఎందుచేతనంటే దానివలన మనం పవిత్రులమవుతాము. వారు మనకు సేవ చేయటానికి అవకాశం ఇచ్చి, మనం పవిత్రులం అవ్వటానికి సహకరిస్తున్నారు అన్న సంగతి మర్చిపోతున్నాము. అది మర్చిపోయి వారు తక్కువ మనం ఎక్కువ అనుకొంటున్నాము. అది మన పాడుబుద్ధికి గుర్తు. వాడు ఏ మతస్థుడైనా, ఏ కులస్థుడైనా పవిత్రుడు కాని వాడికి లోపలఉన్న ఈశ్వరుడు వ్యక్తం కాడు.

తప్పులు ఒప్పులు అన్నీ మనస్సు కల్పించినవే, ఈ మనస్సును దాటితే అంతా జ్ఞానసాగరం, శాంతిసాగరం. అప్పుడు దేహం ఉన్నా, లేకపోయినా శాంతిలో ఊగిసలాడతాము.

లోకం బాహ్యం చూస్తుంది, ఈశ్వరుడు లోపల చూస్తాడు. నేను మీకు నాలుగు మాటలు చెపుతున్నాను, నాన్నగారు బాగా చెపుతున్నారు అని మీరు అనుకొన్నా ఈశ్వరుడు అనుకోడు. నాన్నగారు ఈ మాటలు ఎందుకు చెపుతున్నారు వారి క్షేమం కోరి చెపుతున్నారా లేకపోతే గొప్పలకోసం చెపుతున్నారా లేకపోతే వారికి ఈశ్వరానుభవం కలగాలి అని చెపుతున్నారా అని ప్రతిక్షణం లోపలనుండి ఈశ్వరుడు చూస్తూ ఉంటాడు. మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలంటే ప్రతీరోజూ జాగ్రత్తగా ఉండటం, ప్రతీగంట జాగ్రత్తగా ఉండటం కాదు ప్రతీ క్షణం క్షణం జాగ్రత్తగా ఉండాలి. ప్రతీక్షణం జాగ్రత్తగా ఉంటూ ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలని ఎవరైతే ప్రయత్నం చేస్తున్నారో వారికి మాత్రమే ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఈశ్వరుడు వేరు, ధర్మం వేరుకాదు. ధర్మం ఈశ్వరుడి యొక్క స్వరూపం. ధర్మం యందు గౌరవం లేకుండా ధ్యానాలు చేసినా, విచారణ చేసినా అవి ఫలించవు. సంతోషం నిజంకాదు, దుఃఖం నిజంకాదు. ఇది అంతా మనస్సుకు సంబంధించిన విషయాలు. ఆ మనోనాశనానికే ఈ సత్సంగ సమావేశాలు, జపాలు, ధ్యానాలు, విచారణలు, పూజలు. అభివృద్ధిలోనికి రావాలని రెండు గంటలు ధ్యానం చేస్తున్నాము అంటారు కాని ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు ఏమీ ఫలితం కనబడదు, ఆ మొఖంలో వికాసం ఉండదు, మాటలో మాధుర్యం ఉండదు. వీటి అన్నింటికి కారణం ఒక్కటే పరమేశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే విశ్వాసం మనకు లేదు. లోకం మీద ఉన్న విశ్వాసం, ఇంద్రియాల మీద ఉన్న విశ్వాసం, బంధువుల మీద స్నేహితులమీద ఉన్న విశ్వాసం పరమేశ్వరుడి మీద మనకు లేదు, అదే పెద్దలోపం. విశ్వాసం లేదు లేదు అని మనం బాధపడకూడదు, దానిని మనం పూరించుకోవాలి. మన కాలు జారింది అనుకోండి తీసుకోవాలి. తప్పు చెయ్యటం కంటే దానిని సవరించుకోవటం గొప్ప అన్నాడు ఐన్‌స్టీన్. మాకు భక్తిలేదు, భక్తిలేదు అని అనుకోకూడదు, భక్తి లేకపోతే సంపాదించుకోవాలి. జ్ఞాన సముపార్జన పట్ల అవగాహన లేని వారితోటి, లౌకికులతోటి స్నేహాలు చేయకూడదు, వారితో విరోధాలు పెట్టుకోకూడదు, వారితో తగుమాత్రంగా ఉండాలి. భక్తులతో స్నేహం వలన మనకు భక్తి పెరుగుతుంది, మన మనస్సు భగవంతుడి పాదాలను అంటిపెట్టుకొని ఉంటే మనకు భక్తి పెరుగుతుంది కాని ఏదో చేయటం వలన గాలికి భక్తి పెరగదు, మనం చేయగలిగిన ప్రయత్నం చేయాలి.

అహంకారం వలన అపకారం ఎక్కువగా ఉంటుంది. ఇంట్లో పేచీలకు, బయట పేచీలకు నూటికి తొంభై పేచీలకు అహంకారమే కారణం. వినయం వలన ఉపకారం ఎక్కువ

ఉంటుంది. ఉపకారం కావాలని మనం అనుకోనక్కరలేదు, నీరు ఏవిధంగా అయితే పల్లానికి వస్తుందో అలాగ ఎక్కడైతే వినయం ఉందో అక్కడ ఉపకారం వచ్చి తీరుతుంది. ఆచార్యులవారికి వేదం బాగా తెలుసు, ధర్మశాస్త్రం తెలుసు, పురాణాల సారం తెలుసు, ఆయన ఏదైతే చెపుతున్నాడో దాని తాలుక అనుభవం ఆయనకు ఉంది, అందుచేతనే ఆయన ఆచార్యుడు అయ్యాడు. గురువు తనంతట తాను చెప్పిన దానికి, శిష్యుడు అడిగితే చెప్పిన దానికి ఆ ప్రవాహంలో తేడా ఉంటుంది. శిష్యుడు ఏదైనా అడిగితే అడిగిన దానికి జవాబు చెప్పి వూరుకొంటాడు. గురువు తన హృదయం పొంగి చెప్పటం వేరు, అలా ఆచార్యుడు మాత్రమే చెప్పగలడు. ఆచార్యుడు చెప్పే దానిలో ఆయన అనుభవం ఉంటుంది, ఆయనకు మెప్పులు అక్కరలేదు. పూర్వం ఆచార్యులు చెప్పటమే కాదు, వారి దగ్గర ధనం ఉంటే శిష్యులను పోషించేవారు, అది శిష్యులమీద ఉన్న ప్రేమ. నీ మనస్సును తీసుకొని వెళ్లి ఎక్కడో ముంచుతున్నావు అలాకాదు నీ మనస్సును తీసుకొని వెళ్లి హృదయంలో ముంచు, నాయందు భక్తి కలిగి ఉండు, భక్తి వలన ముక్తి వస్తుంది. మన కుటుంబ పరిస్థితులు ఎంత బాగున్నా మనం వెయ్యి సంవత్సరాలు బతకము. ఈ శరీరం ఎప్పడో ఒకప్పడు రాలిపోతుంది. ఈ శరీరం రాలిపోకముందే జాగ్రత్తలు తీసుకోవాలి. ఇల్లు అంటుకొన్నాక నుయ్యి తవ్వినట్లు ఉండకూడదు, నుయ్యి తవ్వేటప్పటికి ఇల్లు అంతా అంటుకొని పోతుంది. అలాగే చావు వచ్చేరోజున సాధన చేస్తాను అంటేకుదరదు, సాధన మొదలు పెట్టేటప్పటికి మరణం వచ్చేస్తుంది. అందువలన బహుజాగ్రత్తగా ఉండాలి.

నోటితో నా నామాన్ని స్మరించుకో, కళ్లు మూసుకొంటే నా రూపాన్ని ధ్యానం చెయ్యి, కళ్లు తెరిస్తే నా రూపాన్ని చూస్తూ ఉండు, నీ కళ్లు, నీ నాలుక, నీ చెవులు, నీ చేతులు అన్నీ నాకు ఇచ్చేయి అంటున్నాడు భగవంతుడు. ఇంక అప్పడు ప్రకృతి మనలను ఏమి బాధ పెడుతుంది. ఇంద్రియాలను భగవంతుడికి ఇచ్చేస్తే ఇంక ప్రత్యేకంగా నిగ్రహించుకోవటానికి ఏముంది. మనం పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నప్పడు ఇంక డాక్టరు దగ్గరకు వెళ్లటం ఎందుకు? మన మనస్సులో వికారాలు లేనప్పడు ఇంక సాధనలు ఎందుకు? మనలో భక్తి లేకపోవటం వలన చేసే పనులు ఇవి అన్నీ కూడా. భగవంతుడియందు భక్తి లేక ఇలా రోడ్డుమీద తిరుగుతున్నాము. సామాన్య ధర్మాలు, సామాన్య కర్మలు విడిచిపెట్టి నన్ను శరణాగతి చెందు. తల్లితండ్రులను గౌరవించమని మనం చెపుతామకాని ప్రహ్లాదుడు భగవంతుడికోసం తండ్రి మాటకాదన్నాడు. హిరణ్యకశపుడు హరి లేడు అన్నాడు. తండ్రి చెప్పినప్పటికి ఆ మాటను నేను అంగీకరించను అని ప్రహ్లాదుడు చెప్పాడు. నీకు తండ్రి మీద గౌరవం ఉన్నప్పటికీ భగవంతుడికి దూరం అయ్యే మాటలు చెపుతూ ఉంటే ఆ మాటలను విడిచిపెట్టు. భగవంతుడికోసం తల్లితండ్రులను విడిచి పెట్టినా పొరపాటు లేదు. ఒక ఉన్నతమైన స్థితిని పొందటంకోసం, ఆత్మజ్ఞానసముపార్జనకోసం ఏది త్యాగం చేసినా

అది దోషం కాదు. ఆచార్యులవారు ఏమని చెప్పారు అంటే బ్రహ్మం సత్యం. జగత్తు అసలు లేదని కాదు ఉన్న దానివలె కనిపిస్తోంది కాని జగత్తు సత్యం కాదు. బంగారంతో వస్తువులు చేస్తారు వస్తువు నిజం కాదు, బంగారం నిజం. ఆ బంగారం యందు ఈ వస్తువు కల్పించబడింది. అలాగే మట్టితో కుండలు చేస్తారు. కుండ నిజం కాదు. మట్టి నిజం. మట్టి యందు ఈ కుండలు కల్పించబడ్డాయి. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే, అదే బ్రహ్మం. రమణ మహర్షిగారు ఏమని చెప్పారు అంటే ఉన్నదేదో ఉంది, ఆ వస్తువును పొందు, దానిని పొందిన తరువాత అది అద్వైతమా, ద్వైతమా, విశిష్టాద్వైతమా అని నీకే తెలుస్తుంది, ఆ వాదనలలోనికి వెళ్ళద్దు అని చెప్పారు. పంచదార తియ్యగా ఉందని కొందరు, పుల్లగా ఉందని కొందరు, చేదుగా ఉందని కొందరు అంటున్నారు, ఆ గొడవ నీకు ఎందుకు? నువ్వు పంచదార నోట్లో వేసుకొంటే నీకే తెలుస్తుంది కదా, దాని గురించి వాదనలు ఎందుకు? అగ్ని కాలుస్తుంది. నిప్పు మీద చెయ్యి వేస్తే కాల్చదు అని ఎవరైనా చెపితే మనం నమ్ముతామా? నమ్మము ఎందుకంటే అది మన అనుభవం. అలాగే వస్తువు అనుభవంలోనికి వచ్చాక స్థిరత్వం వస్తుంది, ఇంక చెప్పడు మాటలతో పని లేదు అన్నారు భగవాన్. వస్తువును పొందటానికి ప్రయత్నం చెయ్యి అంతేగాని వాదనలలోనికి వెళ్ళవద్దు.

నన్ను ఆరాధిస్తూ, నా రూపాన్ని ధ్యానిస్తూ, నన్ను ఒక్కడినే ఆశ్రయిస్తే నాలో ప్రవేశిస్తావు అని భగవంతుడు చెపుతున్నాడు. భగవంతుడు ఈ లోకాన్ని సృష్టించి మనలను లోకంలోనికి పంపించాడు. ఈ సృష్టిని ఆధారంగా చేసుకొని ఆయనను పొందటానికి మనం ప్రయత్నం చేయాలి. మీకు శత్రువులు ఉంటారు, మిత్రులు ఉంటారు. వారిని సమన్వయం చేసుకొంటూ ఈ ద్వైతం మధ్యన అద్వైతానుభూతితో జీవించాలి. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే. ఈ రకరకాలుగా కనిపిస్తున్నది నిజం కాదు, ఇది అంతా ఆయన మాయ. ఆయన పన్నిన మాయ అనే వల నుండి ఎవడైతే బయటకు వచ్చాడో వాడు మాత్రమే ఈశ్వరుడిని పొందుతాడు. వివేకవంతులు, సాధనాపరులు ఈ వలలో పడరు. తిరగలి మధ్యలో రాడ్ ఉంటుంది. తిరగలి తిప్పతూ ఉంటే ఈ రాడ్ దగ్గరకు చేరుకున్న గింజలను తిరగలి నలపలేదు. అలాగే ఏ జీవుడైతే పరమాత్మను ఆశ్రయించాడో వాడిని ప్రపంచం నలపలేదు, వాడు ప్రపంచంలో ఉన్నా వాడిని ప్రపంచం ముట్టుకోదు, వాడు ద్వైతబుద్ధికి అతీతుడు. హెచ్చుతగ్గులు అన్నీ భగవంతుడిలో లేవు. ఇదంతా మనస్సు యొక్క కల్పితము. భగవంతుడి యొక్క వైభవం గురించి మనకు తెలియటానికి ఆయన గురించి ఎప్పుడైనా శ్రవణం చేస్తే కదా తెలియటానికి. మేమే గొప్పవారము అని మీరు అనుకొంటూ ఉంటే ఇంక ఈశ్వరుడి గురించి మనకు ఏమి తెలుస్తుంది. మనం ఎప్పుడూ ఎదుటివారిలో ఉన్న మంచిని చూస్తూ ఉంటే,

ఎదుటి వారిలో ఉన్న మంచి గురించి వింటూ ఉంటే మనం మంచి వారమవుతాము. మనం చేసే స్నేహాల విషయంలో, చదివే గ్రంథాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మన ఇంట్లో వారందరు శత్రువులు అయినా ఫరవాలేదు మనం క్వైట్‌గా, కూల్‌గా ఉండి మన పని మనం చేసుకోవాలి, వారితో పేచీలు పెట్టుకోకూడదు. మీ మార్గం సరియైనది అయినప్పుడు మీరు దానిని విడిచిపెట్టవద్దు. రైట్‌పాత్, రైట్ అండర్‌స్టాండింగ్, రైట్ యాక్షన్, రైట్ బిహేవియర్ విడిచిపెట్టకూడదు.

మనం భగవంతుడి గురించి శ్రద్ధగా శ్రవణం చేస్తూ ఉంటే విషయబుద్ధి దానంతట అదే ఊడిపోతుంది, ఆత్మబుద్ధి వచ్చేస్తుంది. మనకు నిజంగా దిక్కు ఎవరు అంటే ఈశ్వరుడి పాదాలే దిక్కు అంతకంటే ఇంక దిక్కు ఏదీ లేదు. మనం తరించే వరకు ఆయన పాదాలే మనకు దిక్కు. నీ దేహయాత్రకు సరిపడ పని చేసుకొంటూ మిగతా టైములో నన్ను స్మరించుకొంటూ ఉండు, ఇతరులకు ఏదైనా చేయగలిగితే సహాయం చేయి లేకపోతే మనస్సులో వారి క్షేమం కోరుకోవటంలో దారిద్ర్యం ఎందుకు అంటున్నాడు పరమాత్మ. కొంతమందికి డబ్బు ఉంటుంది, అధికారం ఉంటుంది, అన్నీ ఉండి కూడా ఆధ్యాత్మికంగా దారిద్ర్యం ఉంటుంది. ఇంట్లో కృష్ణా, రామా అనడు, చెప్పకొంటే వారి గొప్పలు చెప్పకొంటారు లేకపోతే ఇతరులను నిందిస్తారు. ఇటువంటి వారికోసం చీకటిలోకాలు కనిపెట్టుకొని ఉంటాయి అన్నాడు అరవిందఘోష్. ప్రజలలో పేరు ఉన్నవాడు ప్రతీవాడు సహృదయుడు అని చెప్పలేము. అవన్నీ భగవంతుడు చూసుకొంటాడు, ఆ జడ్జిమెంట్స్ అన్నీ నీకేల? కుక్కతోక వంకర తీయటం ఎంత కష్టమో లోకంలో ఉన్న వంకరలు తీయటం కూడా అంతే కష్టం. ఈ గోల నీకు ఎందుకు నన్ను శరణువేడుకో, పూర్వజన్మలనుండి నీకు కొన్ని పనికిరాని అలవాట్లు ఉండవచ్చు, ఆ అలవాట్లు నిన్ను సుఖపెడతాయని అనుకొన్నావు కాని ఆ అలవాట్ల వల్ల దుఃఖం వస్తోందని తెలిసి అందులో నుండి బయటకు రావటానికి ప్రయత్నం చేస్తున్నావు. నువ్వు నా పట్ల విశ్వాసపాత్రుడవు అయితే వేలాది జన్మలనుండి వస్తున్న అలవాట్లలో నుండి, బలహీనతలలో నుండి నిన్ను విడుదలచేసి నీ శారీరకఆరోగ్యం, మానసికఆరోగ్యం కాపాడి నీకు శాశ్వతమైన సుఖం, శాంతి, ఆనందం ప్రసాదించే బాధ్యత నాది అని భగవంతుడు వాగ్దానము చేసి చెపుతున్నాడు. కొంతమందికి పుట్టింటి దగ్గర సుఖమే, అత్తవారింటి దగ్గర సుఖమే, సుఖంగా రోజులు వెళ్ళిపోతాయి. కొంతమంది జీవితాలు ముళ్ళకంపలలాగ ఉంటాయి. మీకు రోజులు సుఖంగా వెళ్ళిపోతున్నా అదీ నిజంకాదు, కష్టాలు ఎదురవుతున్నా అదీ నిజం కాదు. మీరు అనుభవించే సుఖాలు కూడా శరీరం చనిపోయేదాకా ఉంటాయి, మరణానంతర జీవితం ఎలా ఉంటుందో చెప్పలేము. ప్రస్తుతం ఈ జీవితంలో అనుభవించే

భోగాలు అన్నీ రోగాల కింద మారిపోతాయి.

భక్తులు తిండి దగ్గర జాగ్రత్తగా ఉండాలి. మీ శరీరం మీద పుండు పడింది అనుకోండి డాక్టరుగారు ఆయింట్‌మెంట్ ఇస్తే దానిని ఒళ్ళంతా రాసుకోరు, ఎక్కడ పుండు ఉందో అక్కడే రాసుకొంటారు అలాగే మీ ఆకలికి సరిపడ అన్నం తినండి అని ఆచార్యులవారు చెప్పారు. మనం పని దొంగలు అవ్వకూడదు. భగవంతుడు మనకు కేటాయించిన పనిని శ్రద్ధగా చేయాలి. అంతేగాని రోడ్డుమీద పని అంతా నొల్లుకోమని కాదు. మన డ్యూటీ మనం చేసాము అనుకోండి, వారి డ్యూటీ వారు చేసారు అని కర్మబంధంలో నుండి మనలను విడుదల చేస్తాడు, వాడు ఈశ్వరుడు. మన డ్యూటీ మనం చెయ్యటమే వచ్చేది వస్తుంది, రానిదేదో రాదు. మనం అనుకోవటం వలన ఎక్కువరాదు, వూరుకోవటం వలన తక్కువరాదు ఈ రెండూ మనం గుర్తుపెట్టుకోవాలి. నేను చేస్తున్నాను, నేను చేస్తున్నాను అనే నేనును ప్రక్కన పెట్టి పని చెయ్యి, అప్పుడు పునర్జన్మలను తీసుకొని వచ్చే బీజాలు పడవు. ప్రతీ జీవుడికి తల్లిగర్భంలో నుండి రావటమే ఇష్టాలు, అయిష్టాలు వచ్చేస్తున్నాయి, నువ్వు అందులో కూరుకొని పోవద్దు, వాటిలో నుండి విడుదల అవ్వటానికి ప్రయత్నం చెయ్యి. ఆచార్యులకు మానవజాతి మీద అపారమైన ప్రేమ ఉంటుంది, మనకు భాషరాదు, భాష వచ్చిన మన భావాలు ఇతరులకు ఎలాగ చెప్పాలో తెలియదు. వారికి భాష ఉంటుంది, లోపల భావనాబలం ఉంటుంది, హృదయం నిండా బంగారం ఉంటుంది. అది మహాప్రవాహంలాగ జీవనదిలాగ వస్తూ ఉంటుంది, ఆ జీవనదిలో మునిగిన వారు అదృష్టవంతులు, గట్టుమీద కూర్చొని ఏడ్చేవారు దురదృష్టవంతులు. గాఢనిద్రలో మనకు ఏ గొడవలేదు, మనం కాని విషయాలలో నుండి విడిపోతున్నాము. నిద్రలో నుండి మెలుకువరాగానే ముందు నేను అనే తలంపు వస్తోంది. ఆ తలంపు వచ్చాక లోకం, పుణ్యం, పాపం, దేవుడు, జీవలక్షణాలు అన్నీ వచ్చేస్తున్నాయి, ఈ ద్వైత ప్రపంచం అంతా ఒక్కసారి పొంగి వచ్చేస్తోంది. ఏది వచ్చిన తరువాత అన్నీ వస్తున్నాయో ఆ నేను తలంపును పడగొట్టు, అదే యుక్తి, అదే వివేకం. అన్ని ఉపాయాలు ఆలోచించుకొని ఈ నేను అనే తలంపులోనుండి విడుదలపొందు, నీ ఔన్నత్యం అంతా అక్కడ చూపించు, నీ సాధన యొక్క గమ్యం అదే. అదే రమణసిద్ధాంతం.

గింజలు వదిలేసి పొల్లు పట్టుకోవద్దు అని చెపుతున్నారు. నీ బలహీనతలు ప్రస్తుతానికి నీకు సంతోషాన్ని కలుగజేసినా వడ్డీతో సహా దుఃఖంగా మారిపోతాయి. నీ బలహీనతలు ఏమిటో నీకు తెలుస్తున్నాయికదా అందులోనుండి విడుదల పొందటానికి ప్రయత్నం చెయ్యి, సబ్జక్టును అర్థం చేసుకొంటున్నారు అనుకోండి మీ అశాంతి అంతా శాంతిగా మారిపోవును. మన దేహం ఎంతకాలం ఉంటుంది అనేది ముఖ్యం కాదు. దేహం దాని ప్రారబ్దం పూర్తి

అయిన వెంటనే వెళ్ళిపోతుంది, ఈలోపు మీ మనస్సును ఆత్మజ్ఞానసముపార్జన మీద ఉంచండి. మీరు ఏ పని చేసినా భగవంతుడి ప్రీత్యర్థం చేయండి, ధర్మం కోసం చేయండి. మీకు ఇష్టం ఉన్నా లేకపోయినా భగవంతుడిమాటను ప్రమాణంగా పెట్టుకొనిచేయండి. జనాలతో ఎక్కువకలువవద్దు, సాధకుడికి కొంత ఏకాంతవాసం అవసరం. భక్తులందరూ ప్రచారం, రాజకీయం ఈ రెండు విషయాలకు దూరంగా ఉండాలి. భక్తులకు కూడా చాలామందికి ప్రచారం కావాలి. నువ్వు ప్రచారం కోరుకొంటున్నావంటే నీ మనస్సు బాహ్యముఖానికి వెళ్ళిపోతుంది. ఆచారం కొంతవరకు మంచిదేకాని ప్రచారం మంచిదికాదు. ముముక్షువుకానివాడు మోక్షాన్ని కోరుకోడు. అందుచేత సత్పురుషులతో సహవాసం చేస్తే ముందు ముముక్షుత్వం వస్తుంది. చేతిలో డబ్బు ఉంటే బజారులో ఉన్న వస్తువును కొనుక్కోవటం ఎంతతేలికో అసలు జ్ఞానం సంపాదించాలనే తలంపు లోపల నుండి వస్తే జ్ఞానం సంపాదించటం అంత తేలిక, ఆ తపన లోపలనుండి రావాలి. మనం పొందవలసింది ఈ జన్మలోనే పొందాలి అనేటువంటి పట్టుదల రావాలి. ఆ పట్టుదల రావటం కూడా గురువు అనుగ్రహం లేకుండా, సజ్జనసాంగత్యం లేకుండా అంత తేలికగా రాదు.

నువ్వు స్వార్థంతో చేసే ప్రతీపని నీకు పునర్జన్మను తీసుకొనివస్తుంది. ఇతరుల క్షేమం కోసం నువ్వు ఏదైనా పని చేస్తే ఆ పని నిన్ను బంధించదు సరికదా బంధంలోనుండి విడుదల చేస్తుంది, నీకు మోక్షాన్ని ఇస్తుంది, అట్టి కర్మను ఆచరించు. అశాంతి ఎలా ఉంటుందో, దుఃఖం ఎలా ఉంటుందో తెలియని స్థితిలోనికి మిమ్మల్ని తీసుకొని వెళ్ళటానికే యోగులు, మహాత్ములు చేసే ప్రయత్నం. మీకు వెయ్యికోట్ల డబ్బు ఉంది అనుకోండి, దుఃఖం వచ్చేస్తుంది. డబ్బు చేసే పని డబ్బు చేస్తుందికాని జ్ఞానం చేసే పని డబ్బు చేయలేదు. ప్రతీ మనిషికి తనంటే తనకు ఇష్టం. ఎందుచేతనంటే లోపల ఉన్నది ఒక్కటి మాత్రమే నిజం. మీలో ఉన్న నిజం మీకు తెలిస్తే అందరి హృదయాలలో ఇదే ఉంది అన్న సంగతి మీకు అనుభవంలోనికి వస్తుంది. మనకు ఎప్పడూ ఉండాలని ఉంది. ఈ శరీరం పోతే మనం పోతాము అనుకుంటున్నాము కాని మనం పోము. మనం ఇప్పడు ఏదిగా ఉన్నామో అది శరీరం పోయిన తరువాత కూడా ఉంటుంది. దాని తాలుక ఎరుక మనకు లేదు, ఆ ఎరుక లేకపోవటమే దారిద్ర్యం. ఆధ్యాత్మిక దారిద్ర్యంలో మనం అందరం ఉన్నంతకాలం మనకు పునర్జన్మలు వచ్చి తీరతాయి, మనిషిని నీడ ఏవిధంగా అయితే వెంటాడుతుందో అలాగ అశాంతి, దుఃఖం మనలను వెంటాడతాయి. ఇప్పడు నీకు దేహంతో ఎలా తాదాత్మ్యం ఉందో అలాగ నీ హృదయంలో ఉన్న నిజంతో తాదాత్మ్యం వచ్చేవరకు ఈ జననమరణ చక్రంలో నుండి విడుదలపొందలేవు. మనకు నిద్రలో స్వప్నం వస్తుంది. ఆ స్వప్నము మనస్సే కల్పించింది.

జాగ్రదవస్థలోనికి వచ్చేవరకు అది నూటికి నూరు పాళ్ళు నిజం అనిపిస్తుంది. స్వప్నానికి కారణం నిద్ర. ఇప్పుడు మనందరం ఇక్కడ కూర్చొన్నాము, ఇదీ స్వప్నమే. ఈ స్వప్నానికి కారణం అజ్ఞానం. మీరు ఏదైనా మంచిపని అహంకారం కోసం చేస్తే దానివలన పుణ్యం వస్తుంది. అదే పని అహంకారం లేకుండా చేస్తారు అనుకోండి మీకు జ్ఞానం వస్తుంది. పుణ్యం కాలప్రవాహంలో పోతుంది, జ్ఞానం కాల ప్రవాహంలో పోయేదికాదు, మోక్షాన్ని ఇస్తుంది. ధర్మం చుట్టూ సమాజాన్ని తిరగమని పరమాత్మ చెప్పాడు. కాని ఇప్పుడు సమాజం ధనం చుట్టూ తిరుగుతోంది, భవిష్యత్‌లో దాని ఫలితం అనుభవిస్తాము అని గాంధీగారు చెప్పారు. మనం సాధ్యమైనంత వరకు జీవితంలో సహజంగా ఉండాలి. సహజంలోనే ఆనందం, అందం ఉంది. ఎవడైతే సహజంగా జీవిస్తున్నాడో వాడు భగవదనుగ్రహం అర్థించకపోయినా, వాడి మీద భగవదనుగ్రహం వర్షిస్తుంది. మీరు అందరూ బాగున్నారు అనుకోండి, అది చూసి నేను సంతోషించలేకపోతున్నాను అనుకోండి, అది కూడా ఆధ్యాత్మిక దారిద్ర్యం. మీకు చదువు ఉన్నా లేకపోయినా, ధనం ఉన్నా లేకపోయినా ఆధ్యాత్మిక దారిద్ర్యం ఉండకూడదు. మనస్సు సంకల్పిస్తుంది, బుద్ధి నిర్ణయిస్తుంది. మనస్సు సంకల్పించినా, బుద్ధి నిర్ణయించినా ఈశ్వరుడి ప్రీత్యర్థం మన జీవితాన్ని వినియోగించుకొంటే మనం ఆయన దయకు పాత్రులవుతాము.

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 10-02-08, ఈడూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన ఇంట్లో ఉన్న పెద్దవారు ఒకవేళ పనిచేయకపోయినవారు ఎంతకాలం జీవిస్తే అంతమంచిది ఎందుచేతనంటే వారు సలహాలు చెప్పటానికి పనికివస్తారు. పుస్తకాలు చదివితే మనకు జ్ఞానం రాదు. పెద్దల దగ్గర నేర్చుకొనే పాఠాలు కొన్ని ఉంటాయి అందుచేత పెద్దలకు సేవ చెయ్యమని చెపుతారు. వారికి సేవచేసి, వారి ఆశీస్సులను పొందటం వలన మన మనస్సు నిర్మలమవుతుంది, జ్ఞానసముపార్జనకు సహకరిస్తుంది. భగవాన్ మిమ్మల్ని సాధన చెయ్యవద్దని చెప్పటం లేదు. మేము ధ్యానం చేస్తున్నాము, జపం చేస్తున్నాము, కాశీ వెళ్ళాము గంగానదిలో మునిగాము అంటున్నారు, ఈ అల్లరి అంతా ఏమిటి అంటున్నారు భగవాన్. కనీసం నీవు ఇంటి దగ్గర ఒంటరిగా కూర్చొని ఇవి అన్నీ చేస్తున్నాము వీటివలన దేహాభిమానం తగ్గిందా, లేదా అని చూసుకొంటున్నావా? నీ చుట్టూ ఉన్న మనుషుల మీద రవ్వంత అయినా మమకారం తగ్గిందా అని కనీసం రోజుకు ఒక్కసారి అయినా ఆలోచిస్తున్నావా? నీవు ఏమీ ఆలోచించటం లేదు. వీటివలన మనస్సు లోపలకు వెళు తుందో లేదో చూసుకోవటం లేదు. ఇంక వాటివలన ప్రయోజనం ఏమిటి? చాలామంది వారు భక్తులు కాకపోయినా ఇతరులు వారిని భక్తులు అనుకోవాలి అనుకొంటారు. మనకు

బయట వారి గొడవ అసలు ఎందుకు? మీరు బాగుపడేవిధానం చూసుకోండి అంతేగాని ఇతరుల గొడవ ఎందుకు? ఆత్మకు ఇతరులు లేరు. మీ మనస్సులో ఏమి జరుగుతోందో అనేది వాచింగ్ ఉందా? ఇంతకాలం నుండి సాధన చేస్తున్నాము ఏమైనా మారుమనస్సు పొందామా? ఏమీ లేదు. మారుమనస్సు పొందటానికి ఏరోజుకారోజు ప్రయత్నం చేయాలి. హృదయాభిముఖంగా ప్రయాణం చేయటానికి, ఎక్కడైతే ఈశ్వరుడు ఉన్నాడో ఆ హృదయ గుహలో ప్రవేశించటానికి ఏరోజుకారోజు మనం సాధన చేయాలి. మేము ఎప్పుడూ ఇలా ప్రయత్నం చేస్తూనే ఉండాలా అని అనుకోనక్కరలేదు. కొంత ప్రయత్నం తరువాత మీ సాధనలతోను, ప్రయత్నాలతోను సంబంధం లేకుండా ఈశ్వరుడే మిమ్మల్ని లోపలకు గుంజుకొని మీ జీవలక్షణాలను పోగొట్టి తన స్వరూపాన్ని మీకు ఇస్తాడు. ఒకవేళ మీరు ఎంత సాధన చేసినా బయటకు గెంటలేని బరువైన రాళ్ళవంటి వాసనలు ఉన్నా గురువు ఆయన చేతితో వాటిని బయటకు లాగి మీకు మోక్షాన్ని ప్రసాదిస్తాడు, వాడు గురువు.

ధ్రువుడిని పినతల్లి చాలా అవమానం చేసింది. మా పినతల్లి అవమానం చేసింది అని అస్తమానూ అనుకొంటే కాలం వృధా అవుతుంది, మహావిష్ణువును ఆరాధించి ఆయన అనుగ్రహాన్ని సంపాదించు బాబు అని తల్లి చెప్పింది. తల్లి చెప్పినట్లు చేస్తే ధ్రువుడికి ఇహం, పరం రెండూ వచ్చాయి, చిరకాలం ఆయన పేరు నిలబడింది, మహాజ్ఞాని అయ్యాడు. రైలుఇంజనుతో పెట్టిని కలపటం వలన ప్రయాణం ఎంత స్పీడుగా సాగుతుందో అలాగ నీవు జపం చేయటం వలన నీకు భగవంతుడితో అనుబంధం ఏర్పడి నీ ప్రయాణం స్పీడుగా సాగుతుంది. నీ కళ్ళకు కనిపించేది, కనిపించనిది అంతా కూడా వాసుదేవ స్వరూపం అని నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు కదా అది నీ కడసారి జన్మ. నీవు నన్ను విశ్వసిస్తున్నావు నీకు సత్యం కాకపోతే అసత్యం ఎలా చెపుతాను అంటున్నాడు పరమాత్మ. మీరు ఏదైనా భోగం విడిచిపెట్టారు అనుకోండి. ఆ భోగం విడిచి పెట్టేసాను అనే స్పృహ కూడా నీకు రాకూడదు, ఆ జ్ఞాపకం రాకూడదు. అటువంటి ఎత్తుకు నువ్వు ఎదిగిరావాలి. మనకు కక్కు వచ్చింది అనుకోండి, ఆ కక్కిన దానిగురించి ఆలోచించము, ఆ కక్కినది కావాలని నీ మనస్సు అడగదు. అలాగే భోగాలన్నీ స్పృహ లేకుండా వదిలేసావా? మాకు జపం చేయటం అయిపోయింది, ఈరోజు పూజ 5 గంటలకే అయిపోయింది అంటే ఇది ఏమైనా బొమ్మలాటా? మీరు ఎంతవరకు బాగుపడుతున్నారో అనేది చూసుకోవాలా? లేదా? నాలుగు మంచిమాటలు చెప్పండి అని శిష్యులు ఆచార్యుల వారిని చివరి టైములో అడిగితే ఉపనిషత్‌లు, భగవద్గీత అధ్యయనం చేయటంలో అశ్రద్ధ పనికిరాదు అని చెప్పారు. వస్తువు మీకు అనుభవంలోనికి వచ్చేవరకు మరుపు వచ్చేస్తుంది, అది శాస్త్రం నీకు జ్ఞాపకంచేస్తూ ఉంటుంది. శాస్త్రాలు చదివి, అర్థంచేసుకొని, అనుభవంలోనికి

తెచ్చుకోవటంలో అశ్రద్ధ పనికిరాదు, అజాగ్రత్త పనికిరాదు అని చెప్పారు. ఇంక నాకు వెళ్ళిపోయే టైము వచ్చింది, మీరు కాలాన్ని సద్వినియోగం చేసుకోండి అని చెప్పారు.

స్మశానంతో బంధువులతో ఉన్న సంబంధం తెగిపోతుంది గాని మనకు జ్ఞానం వచ్చేవరకు గురువుతో ఉన్న సంబంధం తెగదు. జ్ఞానగంగ మన చేతికి అందేవరకు గురువు మనలను వెంటాడతాడు, వాడు గురువు. మీకు పదివేల ఎకరాలు ఉండుగాక, వేలకోట్ల డబ్బు ఉండుగాక, గొప్ప పనులు చేసి ఉండుగాక ఎన్ని చేసినా ఆత్మజ్ఞానం లేకపోతే మోక్షం రాదు. సూర్యుడు ఉదయించకుండా చీకటి బయటకు పోదు. అదేవిధంగా నీవు ఎన్ని మంచిపనులు చేసినా, ఎంత చేసినా నీ హృదయంలో ఉన్న జ్ఞానసూర్యుడు ఉదయించ కుండా మీ లోపల ఉన్న చీకటి బయటకు పోదు అని ఆచార్యులవారు చెప్పారు. ఆచార్యులవారి టీచింగ్ ఏదో అడిగితే చెప్పటం కాదు, నదికి వరద వచ్చినప్పుడు ప్రవాహం ఎంత వేగంగా ఉంటుందో అలా ఆయన టీచింగ్ ప్రవాహంలాగ వస్తూ ఉంటుంది. మీకు విసుగువచ్చి వెళ్ళిపోవాలిగాని ఆయన టీచింగ్ ఆగదు. ఆయన జ్ఞానస్వరూపుడు, బోధస్వరూపుడు. ఏదో ఊహించి చెప్పటంకాదు, అనుభవం చేతిలో పెట్టుకొని చెప్పటం. మనకు తినటానికి తిండి, కట్టుకోవటానికి బట్టలు, డబ్బు అన్నీ ఉన్నాయి కాని ఆధ్యాత్మిక చింతన లేదు, ఆ దారిద్ర్యంలో మనము ఉన్నాము. మీకు ఆ కోరిక ఉంది, ఈ పూజ చేసుకోండి అంటే గౌరవిస్తారు కాని టీచింగ్‌ను ఎవరూ గౌరవించటం లేదు. మనం ఒక మహా జ్ఞాని దగ్గరకు వెళ్ళాము అనుకోండి, వాడికి మనయందు ప్రేమ కలిగింది అనుకోండి, వాడు మన శరీరం వంక చూడడు, మన గుణాల వంక చూడడు, మనస్సు వంక చూడడు, మన హృదయంలో ఉన్న బ్రహ్మంవంక చూస్తాడు. వాడు ఎక్కడికో చూస్తున్నాడు అని మనకు అనిపిస్తుంది కాని మన పని పూర్తి అయిపోతుంది, మనలను రైలులో కూర్చోబెట్టేస్తాడు. ఒక గంట ఆలస్యమో, రెండు గంటలు ఆలస్యమో తప్ప ఆత్మసామ్రాజ్యంలోనికి, ఆనందసాగరంలోనికి ప్రవేశిస్తావు. మనం యుగాలతరబడి తపస్సులు చేసినా, మంచి పనులు చేసినా ఒక మహాత్ముడి యొక్క చూపు చాలు, ఆయన స్పర్శ చాలు మనం బాగుపడటానికి, ఇది పాండిత్యం వలన, ధనం వలన వచ్చేదికాదు. పూర్వం ఋషులు మీటింగులు పెట్టి చెప్పేవారు కాదు. ఎవరికైతే ముముక్షుత్వం ఉందో వారు గురువును ఆశ్రయించి, నమస్కరించి, గౌరవించి, వారు బిక్ష చేసుకొని ఆ బిక్షాన్నములో సగము గురువుకు పెట్టి, ముందు గురువు తీసుకొన్నాక మిగిలినది వారు తిని అలా తరించారు.

డబ్బు ఉంటే చిన్నకారులు, విమానాలు కొనుక్కోవచ్చు. డబ్బు ఉంది అని ఆప్యాయత ఎక్కడ కొనుక్కొంటాము, భగవంతుడిపట్ల భక్తి ఎలా కొనుక్కోగలము, ఆత్మజ్ఞానం ఎలా కొనుక్కోగలము. డబ్బు ఉంటే అన్నీ వచ్చేస్తాయి అని మనం అనుకొంటున్నాము. అది మన

తెలివి తక్కువతనం. ధనవంతుడు, యశస్సు ఉన్నవాడు, పండితుడు శాంతిని పొందుతాడని ఎక్కడాలేదు. అహంకారరహితుడు, మమకార రహితుడు, స్పృహరహితుడు మాత్రమే శాంతిని పొందుతాడు. బుద్ధుడు రోజూ బిక్ష చేసుకొనేవాడు. స్వామి మిమ్మల్ని మహాత్ములు అంటున్నారు, మీరు మా ఇంటికి బిక్షకు వస్తున్నారు సంతోషం, బిక్షకు వచ్చినప్పడు నాలుగు మంచిమాటలు బోధించకూడదా అని అడిగాడు. బుద్ధుడు మాట్లాడేవాడు కాదు, వారి ఇంటికి రావటం మానేవాడు కాదు. ఒకరోజున బుద్ధుడు బిక్ష చేసుకొనే పళ్ళెంలో దుమ్ము పోసుకొని వారి ఇంటికి బిక్షకు వెళ్ళాడు. వాడు బిక్ష తెచ్చి ఆ పళ్ళెంలో ఉన్న దుమ్మును చూసి స్వామీ ఆ పళ్ళెంలో ఉన్న దుమ్మును కిందకు వంచేయండి, అప్పడు నేను బిక్ష వేస్తాను అని చెప్పాడు. పోనీ పెట్టేయవచ్చుకదా అన్నాడు బుద్ధుడు. గిన్నెలో దుమ్ము ఉంటే మీకు అన్నం ఎలా పెడతాను అన్నాడు. మరి మీ మనస్సునిండా దుమ్ము ఉంటే నన్ను ఎలా భోదించమంటావు అన్నాడు బుద్ధుడు. నీవు మోక్షకాంక్ష లేకుండా భోగ కాంక్షలో ఉన్నావు. నువ్వు ఆత్మను కాదు స్మరిస్తూ ఉంట, విషయాలను స్మరిస్తున్నావు ఇంక నీకు ఏమి భోదించమంటావు అన్నాడు బుద్ధుడు. మన చుట్టూ మనలను ప్రేమించేవారు ఉన్నారు అనుకోండి, మన క్షేమం కోరేవారు ఉన్నారు అనుకోండి అప్పడు కూడా కొంచెం సంతోషం రావచ్చు. కాని మన లోపల ఉన్న సుఖం అటువంటిది కాదు. వస్తువులతోగాని, భోగాలతోగాని, ఇంద్రియాలతోగాని, మనస్సుతో గాని, బాహ్యమైన గొడవలతోగాని ఏమీ సంబంధం లేని సుఖం అది. నీవు బ్రాహ్మీ స్థితిని పొందు, అటువంటి సుఖానికి, ఆనందానికి వారసుడవు అయితే ఇంక నీకు పునర్జన్మ లేదు, ఈ ప్రకృతిని దాటి వెళ్ళిపోతావు.

మిమ్మల్ని స్నేహితులు విడిచిపెట్టేసినా, బంధువులు విడిచిపెట్టేసినా, అరుణాచలేశ్వరుడు విడిచిపెట్టడు. ఆయన కొండ రూపంలో ఉన్నాడు. నోటితో చెప్పకుండా మీకు అమృతానుభవం కలిగే వరకూ మిమ్మల్ని వెంటాడతాడు, వాడు అరుణాచలేశ్వరుడు. దేహము ఎక్కడ ఉన్నా మనస్సులో ఆప్యాయత ఉంటే సరిపోతుంది. మీరు చేసిన సాధన ఏమీ వృధా అవ్వదు. సాధన చేస్తూ సిద్ధి పొందకుండా ఈ దేహం చనిపోతే మరల వచ్చే జన్మలో ఎక్కడైతే సాధన ఆపారో అక్కడ నుండి ప్రారంభింపచేస్తాడు. మీరు చేసినది అంతా భగవంతుడు తన బ్యాంక్‌లో ఉంచి మీది మీకే ఇచ్చేస్తాడు. ఒకవేళ మీరు ఆయనను మర్చిపోయినా ఆయనే జ్ఞాపకం చేసి, ఆయనను స్మరించేటట్లు చేసుకొని ఒక జన్మ వెనకోముందో అమృతానుభవం పొందేలా చేస్తాడు, అంతవరకు మిమ్మల్ని విడిచిపెట్టడు, వాడు అరుణాచలేశ్వరుడు. భక్తి, జ్ఞాన మిశ్రితమే విష్ణుసహస్రనామాలు, భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు, నవగ్రహదోషాలు ఉంటే విష్ణు సహస్రనామాలు పారాయణ చేసుకొంటే ఆ దోషాలు పోతాయి. మీకు అహంకారం

తగ్గలేదు, మమకారం తగ్గలేదు. ఏవో సాధనలు చేస్తున్నారు. ఎవరో చెప్పారని జిన్ను మానేసి మరల జిన్ను ఎప్పుడు కనబడుతుందా, జిన్ను మీద పడిపోదాము అని కనిపెట్టుకొని ఉండటం. ఎవరో చెప్పటం ఏమిటి? అసలు నీకు బుద్ధి ఉందా? మీరు చేసే సాధనల వలన మీ చుట్టూ ఉన్న మనుషుల మీద, వస్తువుల మీద రవ్వంత అయినా మమకారం తగ్గిందా? అది చూసుకోండి. ఏదో సాధనలు చేస్తున్నాము అంటే ఏమిటి ప్రయోజనం. కాలాలు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. అలాగే దేహానికి అదృష్టం వస్తుంది, దురదృష్టం వస్తుంది. అదృష్టం సంతోషరూపంలో ఖర్చు అయిపోతుంది, దురదృష్టం దుఃఖరూపంలో ఖర్చు అయిపోతుంది. అన్నీ వస్తూ ఉంటాయి పోతూ ఉంటాయి. ఆ వచ్చి పోయే వాటిమీద నీ మనస్సును పెట్టవద్దు. నీ హృదయంలో సత్యం ఉంది, అది ఒక్కటి మాత్రమే నిజం. దాని మీద నీ మనస్సును నిలబెట్టి ఉంచు.

అజ్ఞానానికి జన్మలు కాని జ్ఞానానికి జన్మలు ఉన్నాయా అన్నారు భగవాన్. పూర్వ జన్మలు ఎంత అబద్ధమో ఈ జన్మలు కూడా అంతే అబద్ధం, రాబోయే జన్మలు కూడా అంతే అబద్ధం. నీ హృదయంలో ఉన్న సత్యం తాలుక ఎరుక నీకు రాగానే నువ్వు ఎత్తిన జన్మలు అన్నీ నూటికి నూరుపాళ్ళు అసత్యం అని నీకు తెలుస్తుంది. వెంకట్రామన్ గారి భార్య పేరు నాగలక్ష్మి. భగవాన్ నాగు అని పిలిచేవారు. ఆవిడ రోజూ రమణాశ్రమానికి వస్తూ ఉండేవారు. ఒకసారి మద్రాసు నుండి భగవాన్‌ను చూడటానికి పదిమంది భక్తులు వచ్చారు. ఒకరు అందమైన చీరకట్టుకొని వచ్చారు. నాగలక్ష్మి గారిది చిన్న వయస్సు. అందరూ చీర బాగుంది అని అనుకొంటున్నారు. మీ చీర చాలా బాగుంది అని నాగలక్ష్మిగారు అన్నారు. ఆవిడ మద్రాసు వెళ్ళిన తరువాత అటువంటి చీర ఒకటి కొని పార్శిల్ రమణాశ్రమానికి పంపారు. అందులో చీర నాగలక్ష్మిగారికి ఇవ్వవలెను అని చీటీ ఉంది. ఆ చీర నాగలక్ష్మిగారికి ఇచ్చేసారు. ఒకరోజు భగవాన్ వంట ఇంట్లో ఉండగా నాగలక్ష్మిగారు అక్కడకు వచ్చి భగవాన్‌కు నమస్కారం పెట్టి అక్కడ నుంచున్నారు. నాగూ ఎవరైనా అందమైన చీర కట్టుకొంటే ఆ చీర మనమే కట్టుకొన్నాము అనుకోవాలి అన్నారు. వారికి మనకు తేడా ఏమిటి? మనం తెలియక వేరు అనుకొంటున్నాము. మనందరము ఒక్కటే, లోపల ఉన్నవాడు వాసుదేవుడే. శరీరము, మనస్సు, ఇంద్రియాలు ఇవన్నీ సత్యంపైన ఉన్న తొడుగులు, దాని మూలంలోనికి వెళ్ళి చూస్తే అందరూ ఒక్కటే. వారి మెడలో బంగారు వస్తువులు ఎక్కువ ఉన్నాయి అనుకో, ఆ వస్తువులు వారు పెట్టుకొన్నారు అనుకోకూడదు, మనమే ధరించాము అనుకోవాలి. స్వామీ! చీర బాగుంది అనటం నిజమేకాని మద్రాసు నుండి పంపమని అడగలేదు అన్నారు నాగలక్ష్మిగారు. నువ్వు పంపమన్నావా, లేదా ఆ గొడవ వదిలెయ్యి. అది కాదు సమస్య. సబ్జక్టు అర్థం చేసుకో. నాగలక్ష్మిగారిది చిన్నవయస్సు, ముందు జాగ్రత్తకోసం,

మనకు కావాలనే బుద్ధి పోగొట్టటంకోసం, ఆ అమ్మాయికి నేర్పిన పాఠం.

ప్రారబ్దాన్ని బట్టి మీకు ఎప్పుడైనా దుఃఖం వస్తుంది, వస్తే రానివ్వండి, అది ఉండదు, వెళ్ళిపోతుంది. అలాగే సంతోషం వచ్చినా వెళ్ళిపోతుంది. మీరు వద్దు వద్దు అనకండి, ఏది వచ్చినా వెళ్ళిపోతుంది. మన శరీరమే బయటకు పోతుంది కదా. అది ఎంతసేపు ఉంటుంది. ఈవేళ ఉండి రేపు వెళ్ళిపోయే దానిమీద మనస్సును ఎందుకు పెడతారు. ఇవి అన్నీ తాత్కాలికాలు. వాటి మీద నీవు స్పృహ పెట్టకు. మనం రోజూ చుట్ట కాలుస్తున్నాము అనుకోండి. డాక్టరుగారు మీరు చుట్టమానేయండి, టిబి వస్తుంది అని చెప్తారు. అప్పుడు మనం చుట్ట కాల్చడం మానేస్తాము. శరీరానికి అనారోగ్యం వస్తుందని మానేస్తాము గాని మానాలి అని అది నువ్వు మానలేదు. ఆ వాసన, కోరిక లోపల ఉంటుంది బయటకు నీకు తెలియదు. ఎవరైనా చుట్ట కాలుస్తూ ఉంటే అయ్యో మనం కాల్చుకునే అవకాశం పోయిందే అనుకొంటాము. లోపలకోరిక అలాగ ఉండిపోతుంది. నీ ఆరోగ్యం బాగుపడితే మరల చుట్ట కాల్చేస్తావు. దాని మీద స్పృహ లేకపోతే దానిని విడిచిపెట్టగలవుగాని బాహ్యంగా విడిచిపెడితే అది విడిచిపెట్టినట్లు కాదు. నువ్వు ఏదైతే వదిలేసావో దానిపట్ల నీకు స్పృహ పనికిరాదు, లోపల ఆ వాసన పనికిరాదు. నీశవం ఈ భూమి మీద తిరుగుతున్నంతసేపు సాధన విడిచిపెట్టకూడదు, ఏదో ఒడ్డుకు వచ్చాము అని తొందరగా నమ్మకూడదు. బయటకు కోరికలు లేకపోయినా ఎక్కడో సూక్ష్మాతి సూక్ష్మంగా బీజరూపంలో కోరికలు ఉన్నా అవకాశం వచ్చినప్పడు అవి విజృంభిస్తాయి, అవే నీ పతనానికి కారణం అవుతాయి. అందుకే తపస్సు విడిచిపెట్టవద్దు, ఈశ్వరుని పాదాలను విడిచిపెట్టవద్దు. మన హృదయంలో ఒక నిజం ఉంది. దానికి సంబంధించిన అనుభవం మనకు ఎంతోకొంత లేకుండా మనం చెపుతూ ఉంటే తప్పకుండా ఫెయిల్ అయిపోతాము.

ఏ గ్రంథం చదివితే ఆదిశంకరాచార్యులవారి హృదయం గురించి తెలుస్తుంది అని కంచి స్వాములవారిని ఒక దొరగారు అడిగితే అది ఒక మహాసముద్రం. మనం బోదులు, కాలువలు ఈదలేకపోతున్నాము ఇంక డైరెక్టుగా సముద్రంలో ఏమి పడతాము. ముందు వివేకచూడామణి చదువు. ఆ మహాజ్ఞాని యొక్క హృదయం కొంతవరకు నీకు తెలుస్తుంది. నీకు మచ్చుకు చూపిస్తున్నాను అని ఆ దొరగారికి చెప్పారు. వివేకచూడామణిలో ఆచార్యులవారు ఏమని చెప్పారు అంటే సూర్యుడి కిరణాలు సముద్రంలో నుండి నీరులాక్కొంటే అవి మేఘాలుగా ఏర్పడి దగ్గరకు వచ్చి, ఆ సూర్యుడు మన కళ్ళకు కనబడకుండా ఈ మేఘాలు చేస్తున్నాయి. అదేవిధంగా నిజమైననేనులో నుండి వచ్చిన ఈ దొంగనేను నిజమైననేను మనకు కనబడకుండా చేసేస్తోంది అన్నారు. ఈ లోకంలోనికి వచ్చేవారు వస్తూఉంటారు, ఉండేవారు ఉంటారు, పోయేవారు పోతూఉంటారు. మీ శరీరం చనిపోయినంత మాత్రాన సృష్టి వ్యాపారం ఆగదు,

ఈ సృష్టి ఇలా నడుస్తూ ఉంటుంది. ఈ సృష్టి అంతా భగవంతుడి సంకల్పం ప్రకారం నడుస్తుంది. ఎవడైతే ఆయనను ఆశ్రయించాడో వాడు ఈ సృష్టిని దాటి బయటకు పోతాడు లేకపోతే మరల ఈ సృష్టిలోనే తిరుగుతూ ఉంటాడు. దేహగతమైన నేను ఉన్నప్పడు ఇంద్రియాలున్నాయి, దేహం ఉంది, వాసనలు ఉన్నాయి, పుణ్యపాపాలు ఉన్నాయి మొత్తం క్షోభ అంతా ఉంది. ఈ నేను ఎక్కడ నుండి వస్తోందో, దాని మూలం మనకు తెలియకుండా మనం అందులోనుండి బయటకు రాలేము. కేవలం మన ప్రయత్నం వలన దానిలో నుండి బయటకు రాలేము దానికి గురువు అనుగ్రహం అవసరం. ఈ దేహగతమైన నేనుకు ఆహారం ఎలా వెళుతోందో తెలుసుకొని దానిని కట్ చెయ్యాలి. మిమ్మల్ని ఎవరైనా పొగిడితే మీకు తెలియకుండా ఈ నేను పెరిగిపోతుంది, మిమ్మల్ని ఎవరైనా విమర్శించారు అనుకోండి, మీరు కుంగిపోతారు అప్పడు కూడా ఈ నేను పెరిగిపోతుంది. నిందాస్తుతులకు ఎందుకు దూరంగా ఉండమని చెప్పారు అంటే దీనివలన దొంగ నేను బలిసిపోతుంది. అందుచేత వాటికి దూరంగా ఉండమని స్వామివారు చెపుతున్నారు.

విషం నోట్లో పోసుకొంటే ప్రమాదం గాని విషయాలు కళ్ళతోటి చూస్తేనే ప్రమాదం. మీరు ఈ యజ్ఞాలు చేయండి, గొప్పలోకాలకు వెళ్ళిపోతారు అని వింటాము అనుకోండి, అప్పడు ఇంక సత్యాన్వేషణ వదిలేసి చెవులద్వారా విన్నది, కళ్ళద్వారా చూసినది ఆ విషయాలు నిన్ను పట్టుకొంటాయి, అవి నిన్ను పీడించి, పీడించి కొన్ని వేల జన్మలకు కారణం అవుతాయి. అందుచేత మనం బహుజాగ్రత్తగా ఉండాలి. విషం కంటే విషయాలు చాలా ప్రమాదం. పెద్దపాము నిన్ను కరిచింది అనుకో అది నిన్ను చంపటానికి పది నిమిషాలు పట్టవచ్చు కాని విషయాలు అలా కాదు చూస్తే పట్టేస్తుంది. సాధుపురుషులు అంటే ఎర్రబట్టలు కట్టుకొన్నవారు కాదు, సహృదయం ఉన్న వారు సాధుపురుషులు. నువ్వు బంగారంలాంటి మనస్సు కలిగి ఉంటే హృదయంలో ఉన్న బంగారం నీకు దొరుకుతుంది. మనస్సు, మాట, చేత ఎవరికైతే ఒకటిగా ఉంటుందో వారు చిత్తశుద్ధి కలవారు. శారీరకతపస్సు, వాక్కుతపస్సు, మానసికతపస్సు ఎవరికైతే ఉన్నాయో వారు చిత్తశుద్ధి కలవారు. ఎవరు ఏ యోగాన్ని అవలంభించినా, ఏ మార్గంలో ప్రయాణం చేసినా చిత్తశుద్ధి అనే గేటు ద్వారానే మనం మోక్షంలోనికి వెళ్ళాలిగాని ఇంకోదారి లేదు. భగవంతుడు ఉన్నాడో లేడో అని ఏరోజుకారోజు మనకు సందేహం. మీ నీడను చూసి మీరు భయపడటం. అహంకారంతో కలిసి జీవించటానికి అలవాటుపడి అహంకార రహితంగా జీవించలేకపోతున్నారు. యజ్ఞం అంటే డబ్బు ఖర్చు అవుతుంది కాని ఒక్క పైసా కూడా ఖర్చు లేకుండా ఉండేది జపయజ్ఞం. నా నామాన్ని స్మరించుకోండి, మీరు పవిత్రులవుతారు, మీ మనస్సు సంస్కరించబడుతుంది, సత్యాన్వేషణకు మీకు యోగ్యత కలుగుతుంది అని భగవంతుడు చెప్పాడు. భగవంతుడి నామాన్ని స్మరిస్తూ ఉంటే ఆ నామం భగవంతుడితోటి అనుబంధం చేకూర్చుతుంది, రైలుఇంజనుకు

పెట్టెను తగిలిస్తే అది ఇంజనును పట్టుకొని ఎలా వెళ్ళిపోతుందో అలాగ నామస్మరణ వలన నీకు భగవంతుడితో చుట్టరికం ఏర్పడుతుంది. జపయజ్ఞం చేసేవారు ఎటువంటివారు అంటే గుమ్మం దగ్గర కూర్చొని యజమాని వచ్చి లోపలకు దయచేయండి అనేవరకు మీరు ఉండనక్కరలేదు, మీ అంతట మీరు సహజంగానే వెళ్ళి హృదయ గుహలో పడిపోతారు. భగవంతుడి మీద ఉన్న భక్తి వలన, నామస్మరణ వలన మీరు సింహద్వారం దగ్గర ఆగనక్కరలేదు, హాలులో కూర్చోనక్కరలేదు, యజమాని వంట ఇంట్లో ఉంటే మీరు కూడా అక్కడకు వెళ్ళిపోవటమే, జపమార్గం అటువంటిది, డైరెక్టుగా భగవంతుడితో అనుసంధానం ఏర్పడుతుంది. భగవంతుడు, భగవంతుడి యొక్క నామం వేరుకాదు, నామం భగవంతుడై ఉన్నది. నామస్మరణ వలన హృదయంలో ఉన్న సత్యమైన వస్తువుతో నీకు అనుబంధం ఏర్పడుతుంది, అనుబంధం ఏర్పడటమే కాదు అది మిమ్మల్ని లోపలకు గుంజుకొని మీరు ఏదిగా ఉన్నారో దాని తాలుక ఎరుక మీకు కలుగుజేస్తుంది, అది జపయజ్ఞం. మీరు జపయజ్ఞాన్ని తక్కువగా అంచనా వేయవద్దు అని భగవంతుడు చెపుతున్నాడు.

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 17-02-08, భీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు భీష్మఏకాదశి. భీష్ముడు పరమపవిత్రుడు, మహాభక్తుడు, మహావీరుడు, మహాజ్ఞాని, బ్రహ్మచారి, స్వచ్ఛంద మరణం కలవాడు. భీష్ముడికి మోక్షం వచ్చిన రోజు కాబట్టి భీష్మ ఏకాదశి అని పేరు వచ్చింది. భీష్ముడిలో ఎంత ఔన్నత్యం ఉన్నప్పటికి, జ్ఞాని అయినప్పటికి ఆయన దేహప్రారబ్ధాన్ని బట్టి కౌరవుల తరపున యుద్ధం చేయవలసి వచ్చింది. మహాభారత యుద్ధంలో అందరికంటే గొప్ప వీరుడు భీష్ముడే. ఆయన కౌరవుల తరపున గొప్పగా యుద్ధం చేసినా, భీష్ముడిని పాండవపక్షపాతి అని ధుర్యోధనుడు అంటూ ఉండేవాడు. ఆయన ఆరాధించిన దేవుడికి ఎదురుగా నిలబడి, ఆ దేవుడి మీద బాణాలు వేసి యుద్ధం చేయవలసివచ్చింది. అదీ ఆయన ప్రారబ్ధం. భీష్ముడు మహాజ్ఞాని అయినప్పటికి ఆయన బాహ్యజీవితంలో అనేకమందిచేత మాటలు అనిపించుకోవలసి వచ్చింది, భగవంతుడికి వ్యతిరేకంగా యుద్ధం చేయవలసివచ్చింది, అదీ ఆ దేహప్రారబ్ధం. బాహ్యజీవితాన్ని చూసి ఏ మనిషిని కొలువకూడదు అని అరవిందఘోష్‌గారు చెప్పారు. మనిషికి ఉన్న డబ్బును బట్టిగాని, గౌరవాన్ని బట్టిగాని, అధికారాన్ని బట్టిగాని మనిషి యొక్క విలువ కొలువకూడదు. అతని హృదయసంపద ఎటువంటిది, అతనికి దైవీసంపద ఉందా అని లోపల మనిషి యొక్క హృదయంలోనికి చూసి, అతని అంతస్థుని చూడాలికాని బాహ్యజీవితాన్నిబట్టి చూడకూడదు. ఒకమాట మాట్లాడేటప్పడుగాని, ఒకపని చేసేటప్పడుగాని ఆ మనిషి యొక్క హృదయం

ఎలా ఉంది, అతను ఏమైనా ఇతరుల క్షేమం కోరుతున్నాడా అని లోపలజీవితాన్ని చూసి ఆ వ్యక్తి యొక్క విలువ కట్టాలి గాని బాహ్యఆడంబరాలను చూడకూడదు. భీష్ముడు భక్తి గురించి, నీతిశాస్త్రం గురించి, జ్ఞానం గురించి చెప్పాడు. అందరూ తరించటానికి విష్ణు సహస్ర నామాలు చెప్పాడు. డబ్బుకి, జ్ఞానానికి ఒకతేడా ఉంది. డబ్బు ఇతరులకు పంచిపెట్టేకొలది తరుగుతుంది. జ్ఞానం అలాకాదు ఇతరులకు ఇచ్చేకొలది పెరుగుతుంది, ప్రేమకూడా ఇచ్చేకొలది పెరుగుతుంది. నేను మీ అందరిని హృదయపూర్వకంగా ప్రేమిస్తూ ఉంటే నా హృదయంలో ఉన్న ప్రేమ తరగదు, అది పెరుగుతుంది. జ్ఞానం, ప్రేమ తరిగే వస్తువులు కాదు. ఒక విషయం గుర్తుపెట్టుకోవాలి ఒక మనిషికి మంచిగుణాలు ఉండవచ్చు అంత మాత్రంచేత వాడు పవిత్రుడు కాదు, గుణవంతుడు మాత్రమే. నూటికి నూరుపాళ్ళు ఎవడి హృదయంలో అయితే స్వార్థం లేదో వాడు ఒక్కడు మాత్రమే పవిత్రుడు. లాల్‌బహదూర్ శాస్త్రిగారు పవిత్రుడు. నాలుగు మంచిగుణాలు ఉన్నంతమాత్రంచేత వాడు పవిత్రుడు కాదు. కొంతమంది బాహ్యంగా చూస్తే చాలా మర్యాదస్థులుగా ఉంటారు లోపలమటుకు నూటికి నూరుపాళ్ళు స్వార్థంగా ఉంటారు. వారు పవిత్రులు కాదు. బాహ్యంగా బాగానే ఉన్నా లోపల శుభ్రంగా కుళ్ళిపోయి ఉంటారు. మీరు సబ్జక్టును బాగా అర్థం చేసుకొని, జాగ్రత్తగా ఫాలో అవుతూ ఉంటే అలా కూర్చొన్నవారు కూర్చున్నట్లుగానే మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది, దానికి బుద్ధిసూక్ష్మత అవసరం.

భీష్ముడు, రామకృష్ణుడు, వసిష్ఠుడు, రమణమహర్షి వంటి మహాత్ముల ద్వారా ఆత్మశక్తి, ఆత్మజ్ఞానం బాగా వ్యక్తమయ్యింది కాబట్టి ఇవాళ మనం వారిని గౌరవిస్తున్నాము. ఎన్ని మంచిగుణాలు ఉన్నా స్వార్థపరుడిలో నుండి భగవంతుడి తాలుక శక్తి వ్యక్తంకాదు. నాలో ఏదైతే ఉందో మీలో కూడా అదే ఉంది, మీలో లేనిది నాలో ఏమీలేదు అని భగవాన్ అంటూ ఉండేవారు. ఆయనలో ఏదైతే ఉందో మనలో కూడా అదే ఉన్నమాట నిజం కాని మనలో ఉన్నది మనకు తెలియటం లేదు, అందుచేత ఇతరులకు వ్యక్తం కావటం లేదు. ఆయనలో ఉన్నది ఆయనకు తెలుస్తోంది, ఆ ఉపాధి ద్వారా ఆయన హృదయంలో ఉన్న జ్ఞానం వ్యక్తమవుతోంది. స్థూలబుద్ధి ఉన్నవారికి ప్రాణాయామం, యోగాభ్యాసాలు అవసరమే, సూక్ష్మబుద్ధి ఉన్నవారికి ప్రాణాయామం అక్కరలేదు, వాడికి ఒక వాక్యం చెపితే, దానిని మననం చేసి అందుకోవలసింది అందుకొంటాడు అన్నారు భగవాన్. నేను ఉంటే అంతా ఉంది, అది లేకపోతే ఏదీ లేదు అని చెప్పారు. ఆ వాక్యం చదివేసి పుస్తకం పడేస్తాము అలాకాదు ఆ వాక్యం దేవుడై ఉన్నది. ఆ వాక్యం ఒక మహాత్ముడి హృదయంలో నుండి వచ్చింది. అందులో ఏదో ఉంటుంది అని దానిని పరిశీలన చేయటం మానివేసి వూరికే చదివి పడేస్తాము ఎందుకంటే ఆ వాక్యం మీద మనకు గౌరవం లేదు, దాని తూకం, విలువ మనకు తెలియటం లేదు వెయ్యి రూపాయల

కాగితం చంటిపిల్లవాడికి ఇస్తాము అనుకోండి, అలా చూస్తాడు, ఇలా చూస్తాడు, తరువాత చింపి అవతల పరేస్తాడు ఎందుచేత దాని విలువ వాడికి తెలియదు, మన పరిస్థితి కూడా అలాగే ఉంది. ఆ వాక్యం విలువ మనకు తెలియక ఏదో చదివి పడేస్తాము. మనకు సబ్జక్టు అర్థమవుతూ ఉంటే, అనుభవంలోనికి వస్తూ ఉంటే మనం బాగుపడటానికి ఒక వాక్యం చాలు, ఒక మాట చాలు. మనకు యోగ్యత ఉంటే ఒక చూపుచాలు, ఒక టచ్ చాలు మనం బాగుపడటానికి. ఏదో కాశీ వెళుతున్నాము, అరుణాచలం వెళుతున్నాము, యాత్రికంగా ఇవి అన్నీ చేస్తున్నాము, ఈ బొమ్మలను గుడుల చుట్టూ, గోపురాల చుట్టూ తిప్పుతున్నాము కాని మనం సత్యాన్వేషకులము కాదు. మనలో సత్యవస్తువు ఉంది, దాని గురించి మనం తెలుసుకోవాలి అని మన సాధనను దాని మీద గురిపెట్టటంలేదు. అది తప్ప బాహ్యంగా ఏది సాధించినా అదంతా స్వప్నంతో సమానము అనే బుద్ధి మనకు రావటంలేదు.

ఏ జీవుడు స్వతంత్రుడు కాదు, ఈ జీవకోటి అంతా బొమ్మలు మాత్రమే. సృష్టి అంతా ఈశ్వరసంకల్పముతో నడుస్తోంది అని చెపుతున్నారు. ఈశ్వరుడు ఎక్కడ ఉన్నాడు? వాడి ఎడ్రసు ఏమిటి అంటే ఆయన నీ హృదయంలోనే ఉన్నాడు. నేను జీవకోటి అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాను అని పరమాత్మ గీతలో చెప్పాడు. ఆయన మెయిన్ ఎడ్రస్ అదే. అయితే మనం హృదయంలోనికి తొంగి చూసుకోవటంలేదు, లోపల ఏమి జరుగుతోందో అసలు వాచింగ్ లేదు. మనస్సు ఎప్పుడూ ఇంద్రియాల ద్వారా బయటకు వచ్చేస్తోంది, దానికి లోచూపు లేదు. మనకు ఎంతసేపు బాహ్యజీవితం గొడవలేకాని తపస్సు లేదు, మనకు అంతర్దృష్టిలేదు. మనం నేను, నేను అంటాము, ఆ నేను నిజం కాదు, అది ఒక తలంపు. అందరి హృదయాలలో నేను ఉన్నాను అని పరమాత్మ చెప్పాడు కదా ఆ నేను సత్యమైనది. దానికి దేహంతో గాని, మనస్సుతోటిగాని, లోకంతోగాని, బాహ్యవిషయాలతోగాని దానికి సంబంధం లేదు. నువ్వు అసత్యముతో తాదాత్మ్యం పొందుతున్నంతకాలము సత్యమైన నేను గురించి నీకు తెలియదు, నువ్వు ఇలా శవాలను మోస్తూ ఉండవలసిందే. నేను అక్కడ అది సాధించాను, ఇక్కడ ఇది సాధించాను అని నువ్వు అనుకొంటున్నావు. అలా అనుకోమని భగవంతుడు చెప్పలేదు, నీ బుద్ధి మంచిది కాక అలా ఏడుస్తున్నావు, నీ రాంగ్‌తింకింగ్ వలన, నీ రాంగ్‌బిహేవియర్ వలన ఇలా అనుకొంటున్నావు అంతేగాని అలా అనుకోమని దేవుడు చెప్పలేదు. నువ్వు అనుకొనే గొడవలకు, నీ ఊహలకు, నీకు వచ్చే తలంపులకు, చావు పుట్టుకలకు, నువ్వు అనుభవించే సుఖదుఃఖాలకు లోపలఉన్న సత్యానికి ఇసుమంతయు సంబంధం లేదు. నీ పిచ్చిని బట్టి నువ్వు అలా అనుకొంటున్నావు. నేను ఉంటే అంతా ఉంది అది లేకపోతే ఏమీ లేదు. ఈ నేను ఆ వాక్యాన్ని ధ్యానం చెయ్యాలి. దేవుడు వేరు, ఆయన చెప్పినమాట వేరు కాదు, అందులో ఆయన

హృదయం ఉంటుంది, ఆయన అనుగ్రహం ఉంటుంది. ఎప్పుడైతే ఆ మాటను మీరు ధ్యానం చేస్తున్నారో, ఏ హృదయంలో ఉండి భగవంతుడు ఆమాటను చెప్పాడో అక్కడకు మీ మనస్సు నెమ్మదిగా జారుకుంటుంది, అది ధ్యానం యొక్క ఫలం. మనస్సు నిలబడటానికి మీరు బొమ్మలను ధ్యానం చెయ్యవచ్చు. కాని ఈ వాక్యాన్ని మీరు ధ్యానం చేయటం వలన అది మీ మనస్సుకు తూకాన్ని పెంచి, దానిని లోపలకు తీసుకొని పోతుంది.

హృదయంలో ఉన్న సత్యంలో ఇష్టంలేదు, అయిష్టం లేదు. దేహముతో తాదాత్మ్యం పొందే నేనులో నుండి ఇష్టం వస్తోంది, అయిష్టం వస్తోంది. నేను గొప్ప గొప్ప పూజలు, జపాలు చేసి గొప్పలోకాలకు వెళ్లిపోతాను అని చెప్పేదీ ఈ దొంగనేనే, ఇతరులచేత గౌరవాలు పొందాలి అనుకొనేది ఈ దొంగనేనే. అదృష్టంతోటి, దురదృష్టంతోటి తాదాత్మ్యం పొందేది నేనే. నువ్వు ఏదైతే కాదో దానితో తాదాత్మ్యం పొందుతూ నేను పుడుతున్నాను, నేను చనిపోతున్నాను, నేను గొప్పవాడిని, నేను దురదృష్టవంతుడిని అని ఇలా ఏదో ఒకటి అనుకొంటూ ఉంటుంది. ఈ దొంగనేను ఉన్నంతకాలం నీకు పుణ్యాలు, పాపాలు, స్వర్గాలు, నరకాలు, స్నేహాలు, విరోధాలు, సుఖాలు, దుఃఖాలు ఇవన్నీ తప్పవు. దానిని మనం విడిచిపెట్టలేకపోతున్నాము. ఈ దేహగతమైన నేనును ఎందుకు విడిచిపెట్టలేకపోతున్నాము అంటే అదే మనం అనుకొంటున్నాము, ఇలా కొన్ని వేల జన్మలనుండి అలవాటు అయిపోయింది, అందుచేత దానిని డౌట్ చేయలేక పోతున్నాము. ఎవరు ఎంత చెప్పినా అది బయటకు పోవటం లేదు, దాని నుండి విడుదల పొందటానికి మనం ప్రయత్నం చేయలేకపోతున్నాము. మాయ అంత బలీయంగా ఉంది. ఒకోసారి మనం చాలా జాగ్రత్తగా మాట్లాడాలి అనుకొన్నా పొరపాటు మాటలు వచ్చేస్తాయి. స్వామీ వివేకానంద ఎప్పడైనా పొరపాటుగా మాట్లాడితే ఆయనకు ఇంటికి వెళ్ళాక పొరపాటు గురించి తెలిసేది. ఎవరి గురించి అయితే పొరపాటుగా మాట్లాడాడో ఆయన ఇంటికి వెళ్లి క్షమించమని చెప్పివచ్చేవారు. అది పెద్దవారి లక్షణం. వివేకానంద అంతటివాడు పొరపాటు మాట్లాడాడు అంటే మాయ ఎంత బలీయంగా ఉందో చూడండి. మనకు పాండిత్యం ఉన్నా, తెలివితేటలు ఉన్నా మాయ బలీయంగా పట్టుకొన్నప్పడు మనం హృదయం యొక్క లోతులలోనికి చేరుకోలేము. అక్కడికి చేరటానికి మనకు తూకం సరిపోదు మాయ ఆడించేస్తూ ఉంటుంది. మాయ దారిఇస్తేగాని మనం అక్కడకు వెళ్లలేము.

ఈలోకం వేరు, దేవుడు వేరు అని మనం అనుకొంటున్నాము. ఎక్కడికక్కడ విడదీసేస్తున్నారు. దేవుడిని పూజగదికి పరిమితం చేస్తున్నారు, బయట ఎలా ఉన్నా పరవాలేదు అనుకొంటున్నారు. లోకం అంతా బ్రహ్మమయం. మీకు కనిపించేది బ్రహ్మం, కనబడనిదంతా బ్రహ్మమే. మీకు బ్రహ్మానుభవం కావాలంటే ఒక ఉదాహరణ చెప్పాడు. బ్రహ్మంకు భిన్నంగా మీరు

ఏది చూడకుండా ఉంటే బ్రహ్మంలో ఐక్యమయ్యే శక్తి పరమేశ్వరుడు మీకు ప్రసాదిస్తాడు. నువ్వు యజ్ఞం చేస్తున్నావు అనుకో అక్కడ అగ్ని ఉంటుంది, అందులో నెయ్యి హోమం చేస్తారు, అగ్ని బ్రహ్మం, నెయ్యి బ్రహ్మం, నెయ్యి వేసే గరిటె బ్రహ్మం, చేసేవాడు బ్రహ్మం, ఎవరిని ఉద్దేశించి చేస్తున్నావో వాడు బ్రహ్మం అనుకొంటూ అంతా బ్రహ్మభావనతో చేస్తే, నువ్వు బ్రహ్మంకు వేరుగా ఏదీ చూడకుండా ఉండగలిగితే నీకు తెలియకుండా నువ్వు బ్రహ్మంలో ఐక్యమవుతావు అని గీతలో చెప్పాడు. అక్కడిదాక ఎందుకు మీకు నేను ఒక అరటిపండు ఇచ్చాను అనుకోండి. నేను ఎల్లయ్యకు ఇచ్చాను అనుకొంటాను. ఆ ఎల్లయ్య బ్రహ్మం అని తెలియటంలేదు. మీకు అరటిపండు ఎలా వచ్చింది, అది మీ సొంతమా, కాదు అది భగవంతుడే ఇచ్చాడు. ఇక్కడ ఇచ్చినవాడు బ్రహ్మం, పుచ్చుకొన్నవాడు బ్రహ్మం, ఇచ్చే అరటిపండు బ్రహ్మం, ఇవ్వటం బ్రహ్మం. ఇంక నువ్వు ఎక్కడ ఉన్నావు? నేను లేను అనే బుద్ధి నువ్వు ప్రాక్టీసు చేస్తే నువ్వు బ్రహ్మంలో ఐక్యమవుతావు. కొంతమంది ఎవరికైనా ఒక అరటిపండు ఇచ్చిన వందపండ్లు ఇచ్చిన గర్వం పెంచుకుంటారు, దానికి కారణం వేరుబుద్ధి. దీనివలన బాహ్యంగా కొంతపుణ్యం రావచ్చుకాని లోపల కుళ్ళిపోతావు. లోకంలో నీవు ఏ పని చేసినా అంతా బ్రహ్మంగానే చూస్తూ పనిచేస్తూ ఉంటే బ్రహ్మంలో ఐక్యమవుతావు. నువ్వు బ్రహ్మంకు భిన్నంగా ఉన్నంతకాలం నీ మీద మాయ బలీయంగా పనిచేస్తుంది. నీ హృదయంలో భగవంతుడు ఉన్నాడు. ఆయన ఎంత జ్ఞానవంతుడో, ఎంత ప్రేమవంతుడో, ఎంత సర్వజ్ఞుడో అని దేవుని యొక్క ఔన్నత్యాన్ని నువ్వు లోపల అహంకారం పెట్టుకొని ఇతరులకు వ్యక్తం చేయాలన్నా అది ఎలా సాధ్యమవుతుంది? సాధ్యం కాదు.

నిద్రలో తెలివితక్కువవాడు, తెలివైనవాడు సమానమే. ధనవంతుడూ, పేదవాడు సమానమే. అధికారం ఉన్నవాడు, అధికారం లేనివాడు సమానమే, నిద్రలో అందరూ సమానమే. అప్పుడు మీ తెలివితేటలు ఎక్కడికి వెళ్ళిపోతున్నాయి. లోపల మీ హృదయంలో దేవుడు వాటిని జాగ్రత్త పెట్టి ఉంచుతున్నాడు. మెలుకువరాగానే నేను అనే తలంపు శిరస్సు లోనికి వచ్చి విజృంభిస్తుంది. నిద్రలో భగవంతుడు అన్నీ జాగ్రత్తపెట్టి ఉంచి నేను అనే తలంపు శిరస్సులోనికి వచ్చి విజృంభించాక ఆ మిధ్యానేనుకు ఆయన జాగ్రత్తపెట్టి ఉంచిన నీ తెలివితేటలు, నీపాపం, నీపుణ్యం అంతా పట్టుకొనిపో అని ఇచ్చేస్తాడు. జాగ్రదవస్థలో వీడు ఆ మూటను వేసుకొని బజారులో తిరుగుతూ ఉంటాడు. జరిగే సంఘటన ఇది. బ్రహ్మకర్మ సమాధి అంటే నీవు చేసే ప్రతీ పనిలోనూ కూడా బ్రహ్మమునే చూడు. అప్పుడు ఏదైతే నేనుగా నీకు వ్యక్తమవుతోందో అది అణిగిపోతుంది, బ్రహ్మమే నీకు తానుగా వ్యక్తమవుతుంది, అది నీ కడసారి జన్మ. అది అపూర్వమైన సాధనా భాగం. గీతలో 4వ అధ్యాయంలో 24వ శ్లోకం మీరు బాగా మననం చేసుకోండి. మీకు ఎంతో బ్రహ్మభావన కలుగుతుంది. మనకు

పూజగదిలో మాత్రమే దేవుడు, బయటకు వచ్చినప్పడు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్నాము. అలాకాదు నీవు చేసే కర్మలన్నింటిలోను కూడా బ్రహ్మమును చూస్తూ పనిచేస్తూ ఉంటే నీకు బ్రహ్మకర్మసమాధి కలుగుతుంది. కర్మ చేస్తున్నప్పడు కూడా నువ్వు సమాధిస్థితిలోనే ఉంటావు. కృష్ణుడు యుద్ధం చేసినప్పడు కూడా సమాధిస్థితిలోనే ఉండే వాడు, అది సహజసమాధి. చెఱుకుగెడలో రసం తీసేసిన తరువాత పిప్పి ఎటువంటిదో నీకు ఆనందానుభవం కలిగాక లోకం గొడవలు కూడా అటువంటివే. నేను ఏదో మూర్తిని ధ్యానం చేసుకొంటున్నాను, యిది నాకు ఏమైనా ఉపయోగపడుతుందా అని భగవాన్‌ను అడిగితే తప్పకుండా ఉపయోగపడుతుంది, ఉపాసన వలన మనస్సుకు ఏకాగ్రత కలుగుతుంది. ఏదైనా నామాన్ని తీసుకొని జపిస్తూ ఉన్నా నీ మనస్సుకు ఏకాగ్రత వస్తుంది. నువ్వు చేస్తున్నజపం భగవంతుడి సన్నిధానంలోనికి తీసుకొనివెళుతుంది. నువ్వు ఏ దేవుడి నామం అయితే చేస్తున్నావో ఆయన మీద నీకు గౌరవం ఉండాలి, నూటికి నూరుపాళ్ళు విశ్వాసం ఉండాలి, అప్పడు ఆ జపఫలితం నీకు వస్తుంది. జపఫలితం వలన మీకు అమృతానుభవం కలుగుతుంది.

శవం కాలేటప్పడు అది సరిగా కాలటంకోసం కర్రపెట్టి పొడుస్తారు. శవంతోపాటు చివరకు ఈ పొడిచే కర్ర కూడా కాలిపోతుంది. అలాగే నేను అనే తలంపును నువ్వు విచారణ చేస్తూ ఉంటే అది మిగతా తలంపులన్నింటిని పోగొట్టి చివరకు ఈ నేను అనే తలంపు కూడా పోతుంది అప్పడు నువ్వు మిగులుతావు అన్నారు భగవాన్. మాయ ఎటువంటిది అంటే ఈ గొడవ వదిలించుకొన్నాము అంటే అది రూపం మార్చి ఇంకో గొడవ రూపంలో వచ్చి దూరుతుంది. అంటే ఒక గోతిలో నుండి లెగిసి ఇంకో గోతిలో పడతాము. ఈ మాయను ఎవరు జయించగలరు. ఎవడైతే నా దయకు పాత్రుడయ్యాడో వాడు మాత్రమే ఈ మాయలో నుండి బయటకు రాగలడుగాని ఇతరులకు సాధ్యం కాదు. మాయ ఇట్టిది అని చెప్పటానికి వీలు లేదు. అది వేషాలు మారుస్తుంది, రూపాలు మారుస్తుంది. అది మాయకాదు అని నీకు అనిపిస్తుంది, వచ్చి నిన్ను పతనం చేస్తుంది. కొంతమంది ప్రతీవిషయానికి విసుగుదలగా ఉంటారు. అది రజోగుణలక్షణం. సత్వగుణం లేకుండా ఎవరికీ తూకం పెరగదు. సాత్వికులు ధన్యులు, వారు లోకమును స్వతంత్రించుకొందురు, వారినే జ్ఞానం వరిస్తుంది. ఎవరు ఏ మార్గంలో సాధన చేసినప్పటికి నేను అనే తలంపు నుండి బయటకు రాకుండా ఎవడూ తరించలేడు. ప్రాణాయామం వలన మనస్సు అణుగుతుంది, జపం వలన మనస్సు అణుగుతుంది. అది సూక్ష్మరూపంలో ఉన్నా మరల మిమ్మల్ని బంధించవచ్చు. చెట్టు ఆకులు లేకుండా ఎండిపోయినట్లు మీకు కనిపించవచ్చు, మరల రెండు వర్షాలు కురిస్తే చిగురించి మరల వృక్షమవుతుంది. అలాగే ఏదైతే నీలో

నేనుగా వ్యక్తమవుతుందో ఆ నేను అనే తలంపు వేరుతో సహా నశించేవరకు నేను తరించాను అని చెప్పటానికి వీలులేదు. ఎక్కడైతే నేను అనే తలంపు అల్పమాత్రంగాను, స్వల్పమాత్రంగాను లేదో అక్కడే భగవంతుడు నీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. అప్పటివరకు నీవు సంసార చక్రంలో ఉండి తీరవలసిందే.

నువ్వు కర్మలో కూడా బ్రహ్మంను చూడకపోతే నీకు తెలియకుండా దేహగతమైన నేనును ముస్తాబు చేసుకొంటూ ఉంటావు, అది నీకు తెలియకుండా జరిగిపోతూ ఉంటుంది. ప్రతీ మనిషికి దేహగతమైననేనును డెకరేట్ చేసుకోవటానికే జీవితం అంతా సరిపోతుంది. సాధన చేస్తున్నాను అని నీవు అనుకొంటున్నావు గాని సాధన పేరుమీద నేను అనే తలంపును డెకరేట్ చేసుకొంటున్నావు. ఈ లోపుగా మరణం వస్తుంది వల్లకాటిలోకి పోతావు. మిమ్మల్ని ఎవరైనా పొగిడితే మీకు ఆనందం కలిగింది అనుకోండి. నిమిత్తమాత్రంగా వచ్చేగౌరవాలుగాని, ఆనందాలుకాని ఇవి అన్నీ భవిష్యత్‌లో దుఃఖం తీసుకొనివచ్చి తీరుతాయి. ద్వితీయం వలన వచ్చే ఆనందం అది ఒంటరిగా రాదు, దుఃఖం అనే ముళ్ళకిరీటాన్ని పెట్టుకొని వస్తుంది, అది మీకు కనబడదు. మీకు సబ్జక్టు ఉన్నది ఉన్నట్లుగా పూర్తిగా అర్థమవుతూ ఉంటే మీ దుఃఖం అంతా ఆనందంగా మారిపోవును. భగవాన్ ఒక రహస్యం చెప్పారు. అందరి హృదయాలలో ఉన్నాను, అంతటా వ్యాపించి ఉన్నాను అని పరమేశ్వరుడు చెప్పాడుకదా. ఆ ఒక్కడినే నువ్వు నానాత్వంగా, అనేకత్వంగా చూస్తున్నావు. అలా చూడకుండా ఆ ఒక్కడినే చూస్తూ ఉండు, నీ మనస్సుకు అలా ట్రైనింగ్ ఇయ్యి. సాధనల పేరుమీద దుమ్ము చేసేసుకొంటావు ఏమిటి? ఎన్నాళ్ళు ఈ దొమ్మరవిద్యలు వేసుకొని తిరుగుతావు. పూర్వం మాతాతగారి టైములో సిమ్మెంట్‌రోడ్లు లేవు, తారురోడ్లు లేవు, అన్నీ మట్టిరోడ్లే, ఇప్పడు కూడా మట్టిరోడ్లుమీద తిరుగుతాను అంటే దానికి అర్థం ఏమిటి? లేటెస్ట్ టెక్నిక్స్ అర్థం చేసుకోండి. మీరు ఏమి చేస్తున్నారు అంటే దేహాన్ని చూస్తున్నారు లేకపోతే మనస్సును చూస్తున్నారు. దేహాన్ని చూస్తే రంగు కనబడుతుంది, మనస్సు వంక చూస్తే గుణాలు కనబడతాయి. దేహం నశిస్తే రంగులేదు, మనస్సు నశిస్తే గుణం లేదు. ఈ రెండూ అబద్ధమే, ఈ రెండూ మాయే. మీరు ఇదంతా వదిలేసి లోపలఉన్న వస్తువును ఒక్కదానినే చూడటం నేర్చుకోండి. మీకు వికారాలు రావు. ఉన్నవస్తువును ఒక్క దానినే అలా చూస్తూ ఉంటే జపం లేకుండా, ధ్యానం లేకుండా, తపస్సు లేకుండా వీటితో పని లేకుండానే మనస్సు దానంతట అది నశిస్తుంది. మీరు రవ్వంతైనా చేసి చూడండి.

వారు బాగున్నారు, వీరు బాగోలేదు, వారి గుణాలు మంచివి, వీరి గుణాలు మంచివి కావు. ఇటువంటి గొడవలు ఎందుకు? ఇలా నువ్వు ఏదైతే కాదో వాటి వంక ఎన్ని సంవత్సరాలు

చూసినా ప్రయోజనం లేదు. నువ్వు ఏదైతే అవునో దానిని చూడటం నేర్చుకో అప్పుడు నీ మనస్సు పడిపోతుంది. ఈ శరీరం నేను, మనస్సును నేను, పుణ్యం నేను, పాపం నేను ఇలా నువ్వు కానిదానిని నువ్వు అనుకోవచ్చు. నువ్వు కానిదానిని నువ్వు అనుకొన్నా నువ్వు కానిది నువ్వు ఎలాగ అవుతావు. నీ హృదయంలో ఒక నిజం ఉంది, దానిని నీవు తెలుసుకోవాలి. నీ హృదయంలో ఉన్న నిజం తెలియకుండా నీకు స్వేచ్ఛ లేదు, స్వాతంత్ర్యం లేదు, అజ్ఞానంలోనుండి బయటకు రాలేవు. వేదంలో ఏమని చెప్పారు అంటే నీ హృదయంలో ఒక నేను ఉంది, అదే నీవు అన్న సంగతి నీకు తెలిసేవరకు జీవుడు బ్రహ్మంలో ఐక్యంకాడు. నువ్వు నీ ఇష్టం వచ్చినట్లు అనుకో. కాని నువ్వు ఏది అనుకొన్నా నువ్వు అదే అయి ఉన్నావు. నేను ఉన్నాను. నేను ఉండటమే కాదు ఆ నేను నేనై ఉన్నాను. ఆ ఎక్స్‌ప్రెషన్ చూడండి. ఒకవేళ నేను ఉండవచ్చు దానికీ మనకీ సంబంధం లేదేమో అని మనం అనుకొంటామేమోనని ఎంత క్లారిటీగా చెపుతున్నారో చూడండి. ఇంత వివరంగా చెపుతూ ఉంటే గ్రహించేబుద్ధిలేకపోతే వారు ఏమి చేయగలరు. గుర్రాన్ని నీటి దగ్గరకు తీసుకొనివెళ్లి తాగమంటాము, అది తాగకపోతే మనం ఏమి చేయగలము. కొంతమందిని మనం సుఖపెడదామన్నా వారి బుద్ధి సరిగా లేకపోతే వారు సుఖపడరు, వారి బుద్ధి వారిని సుఖపడనివ్వదు.

పరుషవాక్యాలు లేకుండా ఎవరైతే మాట్లాడుతున్నారో వారికి వాక్కుతపస్సు ఉన్నట్లు. కొంతమంది పరుషవాక్యాలు మాట్లాడతారు. పవిత్రుడైన లక్ష్మణుడిని సీతమ్మ అనరాని మాటలు అంది, ఆ మాటలకు చివరికి రావణాసురుడు తీసుకొనిపోయాడు. నోటినుండి వచ్చే పరుష వాక్యాలు అవి ఎవరైతే అన్నారో వారి పీక పట్టుకొంటాయి, అందరికీ మంచికలగాలి, అందరికీ సుఖం కలగాలి, అందరూ శాంతిగా ఉండాలి అని హృదయపూర్వకంగా నిండుమనస్సుతో ప్రార్థిస్తూ ఉంటే అది మానసికతపస్సు. భగవంతుడు ఏపని అయితే చేయవద్దని చెప్పాడో శరీరంతో ఆపని చేయకుండా ఉండగలిగితే అది శారీరకతపస్సు. వాక్కుతపస్సు, శారీరకతపస్సు, మానసికతపస్సు లేకుండా లోపలఉన్న జీవుడు పవిత్రుడు కాడు. పవిత్రుడు కానివాడికి, శ్రద్ధలేనివాడికి, జిజ్ఞాసలేనివాడికి జ్ఞానం గురించి చెప్పినా అది పందుల ముందు రత్నాలు పోసినట్లుగా ఉంటుంది అని బైబిలులో చెప్పాడు. ఆ పంది రత్నాలను ముట్టుకోకుండా ఆ రత్నాల ప్రక్కనుండి వెళ్లిపోయినా పరవాలేదు కాని ఆ రత్నాలను కాళ్లతోటి భూమిలోకి తొక్కేసి పోతుంది అన్నాడు. భగవాన్ చెప్పింది ఇంకొకసారి చెపుతున్నాను. మీరు నానాత్వాన్ని చూడటం మానేయండి, అనేకత్వాన్ని చూడటం మానేయండి. జపంతోటి, ధ్యానంతోటి సంబంధం లేకుండా మీ మనస్సు కాలి బూడిద అయిపోతుంది. ఇది ఒక్కపైసా ఖర్చులేనిపని. ఎప్పుడైతే అనేకత్వాన్ని నువ్వు మనస్సుతో చూడటం మానేసావో నీకు ఉన్నవస్తువు ఉన్నట్లుగా

వ్యక్తమవుతుంది. ఒకవేళ మీరు బాహ్యంగా ఏదైనా మాటలు చెప్పినా, మీ మనస్సును ఈశ్వరుడికి ఇవ్వరు అనుకోండి, ఈశ్వరుడు తన స్వరూపం మీకు ఇవ్వడు. మనలో అంతర్యామిగా ఉన్నాడు కాబట్టి మన మనస్సులో ఏముందో ఆయనకు తెలుసు అందుచేత మన మాటలకు ఆయన మోసపోడు. మనం ఒక రూపంతోటి, నామంతోటి తాదాత్మ్యం పొందుతున్నాము కాని దేవుడికి రూపం లేదు, నామం లేదు. అన్ని రూపాలు ఆయనవే, అన్ని నామాలు ఆయనవే. అది తెలియకపోవటం వలన నానాత్వం చూస్తున్నాము. నానాత్వం చూసేకొలది మనస్సు పెరిగిపోతుంది, అన్నింటిలోను ఏకత్వాన్ని చూస్తే మనస్సు దానంతట అదే అణిగిపోతుంది. కడుపులో లేనిది కౌగిలించుకొంటే వస్తుందా అని ఒక సామెత ఉంది. నీకు ప్రేమంటే ఎలా ఉంటుందో, భక్తి అంటే ఎలా ఉంటుందో, ఆప్యాయత అంటే ఎలా ఉంటుందో తెలియదు, బయట ఏదో కౌగిలించుకొంటే అది వస్తుందా? మనం అంతా యాంత్రిక జీవితాలకు అలవాటు పడ్డామని అంతర్యామికి తెలుసు.

ఒకడు భగవాన్ దగ్గరకు వస్తూ టౌనులో ఒక అరటిగెల కొనుక్కొన్నాడు. వాడికి దారిలో వినాయకుడి గుడి కనిపించింది. వాడు ఏమనుకొన్నాడు అంటే గెల అంతా భగవాన్‌కు ఇచ్చే బదులు అందులో ఒక అత్తం తీసి తిరిగి వచ్చేటప్పుడు గణపతికి ఇద్దాము అనుకొన్నాడు. అలా అనుకోవటంలో పొరపాటులేదు. ఆయనవచ్చి ఆశ్రమంలో గెల ఇచ్చాడు, పది నిమిషాలు కూర్చొని వెళ్ళిపోతూ ఉంటే భగవాన్ పిలిచి గణపతి వాటాకూడా నాకు ఇచ్చావేమిటి? గణపతి వాటా గణపతికి ఇచ్చేయి, ఆ గెలలో ఒక అత్తం పట్టుకొనిపో అన్నారు. ఇక్కడ ఒకటి మీరు గుర్తు పెట్టుకోండి. నేను చెప్పిన ప్రతీమాట ఇక్కడ ఎలా రికార్డు అవుతోందో అలాగ మనకు వచ్చే ప్రతీ తలంపు కూడా రికార్డు అయిపోతూ ఉంటుంది, భగవంతుడు సర్వసాక్షి. భగవంతుడు అన్నింటిని జాగ్రత్త పెట్టి ఉంచుతాడు, వాటికి మనం సమాధానం చెప్పాలి, భగవాన్ ఒక మంత్రం చెప్పారు. ఎవ్విరితింగ్ విల్ పాస్ ఎవే. మీకు ఏదైనా మంచి సంఘటన జరిగినా, చెడు సంఘటన జరిగినా ఏదీ నిలబడదు, అన్నీ కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. మంచీ నిలబడదు, చెడూ నిలబడదు, ఎందుచేతనంటే అది నిజం కాదు. నువ్వు ఏదో చేస్తే అది వచ్చింది, అనుభవిస్తే పోతూ ఉంటుంది. దీనికి ఆచార్యులవారు ఏమన్నారంటే ఒకవేళ మీకు నిజంగా దురదృష్టం వచ్చింది అనుకోండి పాయసం నోటిలో పోసుకొన్నప్పుడు ఎలా ఎంజాయ్ చేస్తారో, చెడుప్రారబ్ధాన్ని కూడా అలా ఎంజాయ్ చెయ్యండి, భవిష్యత్‌జన్మలలో మరల ఆ ప్రారబ్ధం నిన్ను ముట్టుకోదు అని చెప్పారు. అక్కడ కూడా నానాత్వాన్ని చూడవద్దు, అందులో కూడా బ్రహ్మంనే చూడు, అప్పుడు నీ మనస్సుకు వికారాలు రావు. సృష్టిలో ఏ సంఘటన జరిగినా అది బ్రహ్మంకు తెలియకుండా జరగటానికి వీలులేదు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| ఏప్రియల్ | 6 | ఖండవల్లి |
| ఏప్రియల్ | 13 | భీమవరం, ఆనంద ఎస్టేటు |
| ఏప్రియల్ | 14 | పాలకోడేరు - శ్రీరామనవమి |
| ఏప్రియల్ | 20 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

**శ్రీ రమణ మహర్షి శిష్యులైన మీరు**

**N తో ఎత్తుకెదిగినారు కీర్తిలో మీ**

**A నలోని అభిమానమును మేము**

**N టికీ మర్చిపోలేము మా శిశు మందిర్**

**N తో పుణ్యం చేసుకుంది మీ రాకతో. మీరు మా**

**A డ చూపిన ఆదరణ మీ ఔన్నత్యం ఈ**

**G ల్లాకే తలమానికం.**

**A క్కడ మీ పాదం సోకుతుందో అక్కడ మీరు చెప్పిన**

**R యోక్తి వెదజల్లబడి అందరిలో హైందవ విత్తునాటబడి**

**U గయుగాలా ప్రాకాలని ఆకాంక్షిస్తూ......**

Remember **M**

Remember **E**

Don't Remember **"ME"**

అని వేడుకొంటూ

**శ్రీ సరస్వతి శిశు మందిరం**

**లక్కవరం**



విజయవాడ సీతానగరం రామకృష్ణ మిషన్ స్వామీజీతో
సద్గురు శ్రీ నాన్నగారు



విజయవాడ సీతానగరం రామకృష్ణ మిషన్ హైస్కూలులో
ప్రసంగిస్తున్న సద్గురు శ్రీ నాన్నగారు